
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

శుక్రవారం 20 డిసెంబరు 2024



సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా శోభారాణి



నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా కే శోభారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థుల్లో ప్రేరణ కల్పిస్తూ బోధన సాగించడం ద్వారా ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తానని ఆమె అన్నారు.

అటాక్!

సాయంత్రం కాదు.. పగటిపూటా దోమల దండయాత్ర

ఆంధ్రజ్యోతి పరిశీలన

గుయ్.. గుయ్.... మంటూ దోమలు దండయాత్ర చేస్తున్నాయి. సాయంత్రం కాదు.. పగటిపూట కూడా ప్రజలను వదలడం లేదు. కనబడ్డవారినల్లా కుట్టి రక్తాన్ని పీల్చేస్తున్నాయి. వాతావరణంలో ప్రతికూలత ఏర్పడటంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు చలి కూడా ఎక్కువైంది. పేరుకుపోయిన చెత్తకుప్పలు.. పారుదల లేని మురుగు కాలువల్లో లార్వా నుంచి దోమలు పురుడు పోసుకుంటున్నాయి. ఆ తర్వాత 'అటాక్' అంటూ ప్రజలపై విజృంభిస్తున్నాయి. వీటిని నిలువరించాల్సిన నగరపాలక సంస్థ, పురపాలక సంఘాలు ఘోరంగా విఫలమవుతున్నాయి. కొన్నిచోట్ల ఫాగింగ్ యంత్రాలు మూలనపడగా, అక్కడక్కడా డ్రైనేజీ కాలువల్లో ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్‌లతో యంత్రాంగం చేతులు దులుపుకుంటోంది. కాయిల్స్, లిక్విడ్‌లకూ జంకని దోమలకాటుతో అనేక మంది రోగపీడితులై ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.





రాజావారివీధిలో చెత్తా చెదారం మధ్య పందులు



కావలిలో చెత్తకుప్పలు

కావలి, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుఽధ్యం వ్యవస్థ అధ్వానంగా ఉంది. 40 వార్డులు ఉన్న పట్టణంలో నాలుగు డివిజన్లకు డివిజన్‌కు రెండు ట్రాక్టర్లు వంతున 8 ట్రాక్టర్లు చెత్తను తరలిస్తున్నాయి. ఆ చెత్తను ట్రాక్టర్ల నుంచి కంపోస్టు యార్డుకు తరలించేందుకు ఏర్పాటు చేసిన కంపాక్టర్ వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరంతా చెత్తలో చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఇక పందుల గుంపు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక కాలువల్లో పూడికతీత, దోమల నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపాలిటీలో ఉన్న 5 ఫాగింగ్ మిషన్ల ద్వారా నిత్యం ఫాగింగ్ చేస్తున్నా దోమల ఉధృతి మాత్రం తగ్గడం లేదు. మురుగు కాలువల్లో దోమల లార్వా నియంత్రణకు స్ప్రే చేయడం లేదు.



ఆత్మకూరు : నివాసాల మధ్య మురుగునీరు

నెల్లూరు : ఇరుకళల పరమేశ్వరి ఆలయ సమీపంలో ఖాళీ ప్రదేశాల్లో పాచిపట్టిన మురుగునీరు



ఫాగింగ్ చేస్తున్నా డోంట్‌కేర్!

కందుకూరు, (ఆంధ్రజ్యోతి) : ఫాగింగ్ జరుగుతున్న దోమలు మాత్రం కందుకూరు వాసులను వదలడం లేదు. రాత్రయితే బయట ఉండే పరిస్థితి లేనంతగా దోమలు ముసురుతున్నాయి. ప్రధానంగా గుణ్ణంకట్ల కుంట, ముత్యాలకుంట, కోమటికుంట, చాకలికుంట పరిసరాలు దోమల వృద్ధి కేంద్రాలుగా ఉంటున్నాయి. అలాగే అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోని ఖాళీస్థలాల్లో వర్షపునీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల నియంత్రణకు ఫాగింగ్ తోపాటు ఇతర మందులు పిచికారీ చేయడం, మురుగుకాలువలు, గుంతలు, నివాసగృహాల మధ్య ఆయిల్‌బాల్స్ వేయించటం వంటి కార్యక్రమాలు చేపట్టాలి. మరోపక్క మురుగుకాలువల్లో చెత్తాచెదరం తీసి రోడ్డుపైనే వదిలేస్తున్నారు. రోజుల తరబడి వాటిని తీయకపోవడంతో కుక్కలు, పందులు, కోళ్లు రోడ్డు అంతా వెదజల్లి వీధులను అపరిశుభ్రం చేస్తున్నాయి. గతంలో చెత్త తీసిన వెంటనే ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా తరలించేవారని ప్రస్తుతం కూడా అదేపద్ధతి అవలంబించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆత్మకూరులో కానరాని నియంత్రణ

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో 23 వార్డులు ఉండగా, వీటిలో 14 మురికివాడలున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు పారుదల లేక ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక దోమల ఉధృతి పెరగడంతో వ్యాధులు అధికమవుతున్నాయి. మున్సిపాలిటీలో 4 ఫాగింగ్ యంత్రాలు ఉన్నా ఇంతవరకు ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. ఇటీవల రెండు యంత్రాలకు మరమ్మతులు చేయించామని, వర్షం తగ్గిన తరవాత ఫాగింగ్ చేయిస్తామని పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. కనీసం మురుగు గుంతల్లో ఆయిల్‌బాల్స్ కూడా వేయకపోవడంతో దోమల ఉధృతి ఎక్కువైంది.

నగరం.. నరకం

నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి) : 149.02 చ.కి.మీ విస్తీర్ణం కలిగిన నెల్లూరులో 99 మురికివాడలు ఉన్నాయి. 56 డివిజన్లు ఉన్న నగరంలో 7.5 లక్షల మంది జనాబా ఉన్నట్లు కార్పొరేషన్ సిబ్బంది తమ గణాంకాల్లో తేల్చారు. సుమారు 8 వేల వరకు ఖాళీ స్థలాలు ఉన్నట్లు లెక్కలు తీసిన అధికారులు ఇవన్నీ దోమల పుట్టినిళ్లుగా చెప్పుకొస్తున్నారు. లార్వా పురుడుపోసుకుని దోమగా మారి నగరంపై దండయాత్రకు ఇక్కడే పునాది అవుతుంది. పాత మున్సిపల్ ప్రాంతం డ్రైనేజీ వ్యవస్థ మెరుగ్గానే ఉండటంతో దోమల దాడి పెద్దగా లేదు. పైగా ఖాళీ స్థలాలు కూడా తక్కువే. విస్తరించిన శివారు, విలీన ప్రాంతాలలో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండి డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా లేదు. దోమలు వృద్ధి చెంది ప్రజల రక్తాన్ని పీల్చేస్తున్నాయి. డ్రైనేజీ కాలువలు, ఖాళీ స్థలాల్లో లార్వా, దోమలను నాశనం చేసే ఆయిల్ బాల్స్ స్ప్రేయింగ్ ప్రక్రియ ఈ ప్రాంతాలలో పెద్దగా జరగడం లేదు. ఇక ఫాగింగ్ యంత్రాలు 5-7 వరకు పనిచేయక మూలనపడేశారు. రెండు యంత్రాలను మాత్రం అటు రూరల్, ఇటు సిటీ నియోజకవర్గాల్లో రోజుకు రెండు డివిజన్ల చొప్పున వాడుతున్నారు.

పత్తాలేని 'గంబూజీయా'

సిటీలో లార్వాను ఆహారంగా తీసుకునే గంబూజీయా చేపల వాడకాన్ని కార్పొరేషన్ అధికారులు పూర్తిగా పక్కనపెట్టేశారు. ఈ చేప కేవలం లార్వాను మాత్రమే తింటుంది. దీనివల్ల దోమల ఉత్పత్తి ఘననీయంగా తగ్గుతుంది. గత టీడీపీ హయాంలో నగర మంతా ఈ చేపలను నీటి నిల్వప్రాంతాలలో వదిలిన ఎస్‌ఎంసీ అధికారులు మంచి ఫలితాలనే రాబట్టారు. కానీ గడిచిన ఐదేళ్లగా ఈ ప్రక్రియకు స్వస్తి పలికారు. ఇప్పుడైన గంబూజీయా చేపలను ఖాళీ స్థలాలు, నీటి నిల్వ ప్రాంతాలలో వదిలి లార్వాను నాశం చేస్తే దోమల వ్యాప్తి తగ్గుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఖాళీ స్థలాల వారికి నోటీసులు ఇచ్చి చేతులు దులుపేసుకుంటున్నారు.



నెల్లూరు : రాజీవ్‌గృహకల్ప వద్ద మురుగు నిల్వ

బుచ్చిలో..

బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఖాజానగర్, రామచంద్రాపురం, హౌసతోట, సుబ్బారెడ్డినగర్ ప్రాంతాల్లో గుడపల్లి కాలువ వెంబడి దోమలు విజృంభిస్తునాయి. నగర పంచాయతీలో ఫాగింగ్, 2 స్ప్రేయింగ్ పరికరాలు ఉండగా, రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున స్ప్రేయింగ్ చేయడంలేదు. రెండు స్ప్రేయింగ్ పరికరాలతో దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్టు కమిషనర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.



బుచ్చిరెడ్డిపాళెం : హౌసతోటలో గుడపల్లి కాలువ దుస్థితి

భూ సమస్యల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్

కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం

రెవెన్యూ, పోలీసు అధికారులతో కమిటీల ఏర్పాటు

ప్రజలను పట్టిపీడిస్తున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చాలా వరకు భూ వివాదాల్లో సివిల్, క్రిమినల్ వ్యవహారాలు ముడిపడి ఉంటున్నాయి. దీంతో వీటి పరిష్కారానికి రెవెన్యూ, పోలీసు శాఖలతో టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో ఈ కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు ఈ టాస్క్‌ఫోర్స్‌ల ఏర్పాటు, పనితీరుకు సంబంధించి విధివిధానాలను పంపింది. ప్రస్తుతం జిల్లాలో మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీల నియామకం జరుగుతోంది. ఈ కమిటీలో తహసీల్దార్, ఎస్సైలతోపాటు స్థానిక రెవెన్యూ, పోలీసు సిబ్బంది ఉంటారు. ఈ కమిటీల ఏర్పాటు పూర్తి కాగానే డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీలతో కూడిన కమిటీలను నియమించనున్నారు. భూ వివాదాలకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించడమే ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీల ప్రధాన లక్ష్యం.

- వివరాలు 6లో..

గతి తప్పుతున్న ప్రగతి చక్రం!

● ఆర్టీసీలో పదేళ్లుగా భర్తీకాని పోస్టులు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ)లో సిబ్బంది కొరత తీవ్రరూపం దాల్చుతోంది. దశాబ్ద కాలంగా ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించకపోవడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం ఎక్కువవుతోంది. నెల్లూరు రీజియన్ పరిధిలో సుమారు 300 వరకు డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీలలోని పలు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. కారుణ్య నియామకాలు మినహా 2013 నుంచి ఇప్పటివరకు పోస్టుల భర్తీ కోసం ఒక్క నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. ఉన్న సిబ్బందిపై భారం పెరుగుతుండటంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం గాలిలో దీపంలా మారుతోంది.

● ప్రైవేటు డ్రైవర్లే దిక్కు!

ఆర్టీసీ నెల్లూరు రీజియన్‌లో డ్రైవర్ పోస్టులు 125 వరకు ఖాళీగా ఉన్నట్లు సమాచారం. ట్రాఫిక్ అధికంగా ఉన్న సమయంలో డిపో మేనేజర్లు కాల్ ఆన్ డ్రైవర్లు అంటే ప్రైవేటు డ్రైవర్లకు రోజువారి వేతనం చెల్లించి బస్సులను తిప్పుతున్నారు. ఆర్టీసీ బస్సు అంటేనే సురక్షిత ప్రయాణమని ప్రజలు నమ్ముతుంటారు. అందుకు ప్రధాన కారణం సంస్థకు చెందిన డ్రైవర్లకు బస్సు నడపడంపై ఎంతో నైపుణ్యత కలిగి ఉంటారు. అయితే ప్రైవేటు డ్రైవర్లతో బస్సులు తిప్పుతుండటంతో సురక్షితంపై ప్రయాణికుల్లో ఆందోళన రేగుతోంది.

● కనుమరుగవుతున్న కండక్టర్లు

సురక్షితమైన ప్రయాణంపై డ్రైవర్ దృష్టి పెడుతుంటే కండక్టర్ ప్రయాణికులను బస్సులో ఎక్కించుకోవడం, వారితో మర్యాద పూర్వకంగా మలుచుకుంటూ చార్జీలు వసూలు చేసి సంస్థకు ఆదాయం పెంచేవారు. అయితే, పల్లె వెలుగు సర్వీసులు మినహా దూరప్రాంతాలకు బస్సుల్లో కండక్టర్లు కనిపించడం లేదు. సింగిల్ డ్రైవర్, డబుల్ డ్రైవర్ బస్సులే రోడ్డుమీద తిరుగుతున్నాయి. డ్రైవర్ బస్సును నడుపుతూనే కండక్టర్ విధులు కూడా నిర్వహిస్తున్నారు. దీంతో ఆ డ్రైవర్‌పై పనిభారం పెరిగిపోతూ డ్రైవింగ్‌పై దృష్టి సారించలేకున్నారు.

● గ్యారేజీలలోనూ అంతే!

పది సంవత్సరాలుగా ఆర్టీసీలో పోస్టులు భర్తీ చేయకపోవడంతో గ్యారేజీలలో పనిచేసే అనేక రకాల ఉద్యోగులపై పనిభారం పెరిగిపోతోంది. వైసీపీ సర్కారులో కొత్త బస్సులు ఒకటి కూడా ఇవ్వకపోవడం, కాలం చెల్లిన బస్సులకు మరమ్మతు చేసి రోడ్లపైకి పంపేవారు. అయితే గ్యారేజీలలో ఉద్యోగులు అడిగిన స్పేర్ పార్ట్స్ కూడా సరిగా అందించక పోవడం, పూర్తి స్థాయిలో సిబ్బంది కొరతతో ఉన్నవారిలో అసహనం పెరిగిపోతోంది. రీజియన్‌లో సుమారు 150 పోస్టులకుపైగా ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది.

జికా వైరస్‌పై జాగ్రత్తలు తీసుకుంటున్నాం

● పూణే ల్యాబ్‌కు రక్తనమూనాలు : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అనుమానిత జికా వైరస్‌పై అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మర్రిపాడు మండలం వెంకటాపురానికి చెందిన బాలుడు సుబ్బరాయుడు, తల్లిదండ్రులు, సోదరిల నుంచి రక్త నమూనాలు తీసి పూణే వైరాలజీ ల్యాబ్‌కు పంపినట్లు పేర్కొన్నారు. అలాగే మరో 20 మంది రక్తనమూనాలు కూడా పంపించామని, ఇంకా ఫలితాలు రావాల్సి ఉందన్నారు. వెంకటాపురంలోని 152 ఇళ్లలో ఇంటింటికి వెళ్లి వైరస్ లక్షణాలు జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు ఉన్నయా లేదా పరిశీలించామని, ఎవరూ ఆ లక్షణాలతో లేరని పేర్కొన్నారు. ఇక దోమల నివారణకు ఇంటి బయట, లోపల స్ప్రే చేస్తున్నామని, ఫాగింగ్ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, ఎలాంటి ఆందోళన వద్దని కోరారు.

రేపు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం

నెల్లూరు(విద్య), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ, అన్ని మేనేజ్‌మెంట్ల కింద నడుస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశం శనివారం నెల్లూరులోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. 2025 మార్చిలో జరగనున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలు, ప్రాక్టికల్స్, థియరీ కేంద్రాల ఏర్పాట్లపై చర్చిస్తామన్నారు. అలాగే నైతిక విలువలు, పర్యావరణ విద్య, ప్రాక్టికల్స్, థియరీ పరీక్షల సన్నాహక చర్యలపై దిశానిర్దేశం చేస్తారన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది వివరాల నమోదు, అపార్ కార్డుల జారీ, 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి కొత్త జూనియర్ కళాశాలల ఏర్పాటు, అఫిలియేషన్, రెన్యువల్స్‌పై కూడా చర్చ ఉంటుందని తెలిపారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు అందరూ ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

'పోక్సో' కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

● రూ.20 వేల జరిమానా

అల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి జీవిత ఖైదు, రూ.20 వేలు జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు గురువారం సంచలన తీర్పు ఇచ్చింది. అల్లూరు ఎస్‌ఐ కె.కిషోర్ బాబు కథనం మేరకు.. 2015 జూలై 8న అల్లూరులో తల్లిదండ్రులు లేని ఓ బాలిక పెద్దమ్మ ఇంటిలో ఉంటూ చదువుకుంటోంది. వరుసకు అన్న అయిన చెంబేటి మురళి మద్యం సేవించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాలికపై బలాత్కారానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని బాలిక పెద్దమ్మకు తెలపడంతో ఆమె ఎవరికీ చెప్పవద్దని చెప్పి, ఆమంచర్లలోని ఓ హాస్టల్‌లో చేర్పించారు. అయితే, బాలిక ఆరోగ్య పరిస్థితిలో మార్పులు రావటంతో హాస్టల్ సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించగా, గర్భం దాల్చినట్లు వైద్యులు నిర్ధారించారు. ఐసీపీసీ అధికారుల సహాయంతో బాలిక అల్లూరు పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుతో విచారించిన అప్పటి కోవూరు సీఐ అశోకవర్ధన్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కావలి డీఎస్పీ పి.శ్రీధర్, కావలి రూరల్ సీఐ బి.పాపారావు, అల్లూరు ఎస్‌ఐ కె.కిషోర్ బాబులు ఈ కేసుకు అవసరమైన సాక్ష్యాధారాలను సమకూర్చారు. ప్రాసిక్యూషన్ వారు నేరం రుజువు చేయడంతో చెంబేటి మురళికి జీవిత ఖైదు, రూ.20 వేలు జరిమానాను విధిస్తూ న్యాయాధికారి సుమ తీర్పు ఇచ్చారు.

నరుకూరులో కుంగిన రోడ్డు



తోటపల్లిగూడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరుకూరు నుంచి తోటపల్లిగూడూరుకు వెళ్లే మార్గంలో కోడూరు కాలువకు సమీపంలో రహదారి గురువారం ఉదయం కుంగి పెద్ద గుంత పడింది. దీంతో ఆ రహదారిలో వెళ్లే వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ రహదారిలో కోడూరు కాలువకు సమీ పంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న పంట పొలాలకు సాగునీరు సరఫరా జరిగే కాలువ ఉంది. ఈ కాలువకు చిన్నపాటి వంతెన నిర్మించారు. అది పటిష్టతను కోల్పోయి కుంగిపోయింది. గ్రామస్థులు ఇరి గేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడం తో ఆ హోల్ వద్ద జాగ్రత్త చర్యలు చేపట్టారు.



నెల్లూరులో సీఎస్ బస

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి నెల్లూరులోని ఆర్అండ్బీ అతిథి గృహంలో బస చేశారు. నగరానికి వచ్చిన సీఎస్‌కు కలెక్టర్ ఆనంద్ పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్ పాల్గొన్నారు. సీఎస్ జిల్లా మీదుగా వెళుతూ ఇక్కడ బస చేసినట్లు సమాచారం.

వెంకటాపురంలో పారిశుధ్య చర్యలు

- 13 మంది నుంచి రక్త నమూనాల సేకరణ



గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది



గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం

జికా వైరస్ కలకలంతో మర్రిపాడు మండలం వెంకటాపురంలో పారిశుధ్య మెరుగు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. అలాగే వైద్యశిబిరం నిర్వహించి, గ్రామస్థుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్నారు. ఆరేళ్ల బాలుడికి జికా వైరస్ లక్షణాలు బయటపడిన విషయం తెలిసిం దే. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్ తన సిబ్బందితో గురువారం కూడా వీధులు శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యుడు గోపినాథ్ గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, గ్రామంలో 9మందికి, బాలుడు చదువుతున్న కృష్ణాపురం పాఠశాలలో నలుగురు విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి నెల్లూరు ల్యాబ్‌కు పంపారు. గ్రామంలో ఎవరికీ జ్వర లక్షణాలు లేవని, ప్రజలు ఆందోళన చెందవద్దని తహసీల్దారు అనిల్‌కూమార్ తెలిపారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)



రైల్వే యార్డులో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి

యూరియా కొరతే లేదు

- జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి

కోవూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ సీజన్‌లో యూరియా కొరతే లేదని, రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ అధికారిణి పీ.సత్యవాణి తెలిపారు. స్థానిక పడుగుపాడు రైల్వేస్టేషన్ యార్డులో గురువారం ఆమె యూరియా లోడింగ్ జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు ఈ నెలలో 25 వేల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే 12 వేల మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందన్నారు. మిగతా 18వేల టన్నులు యూరియా ఈ నెలాఖరులోగా వస్తుందని, అందులో 8వేల టన్నులు వారం రోజుల్లోనే వస్తుందని పేర్కొన్నారు. యూరియా దొరకదని రైతులు ఆందోళన చెంది స్టాకు పెట్టుకోవద్దన్నారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు నర్సోజీరావు, ఏడీఏ సుజాత, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

20 నుంచి 40 శాతం వరకు రాయితీలు

పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యం


- రైతులకు పాత బకాయిల చెల్లింపు
- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి

ఉద్యాన పంటలు లాభసాటిగా ఉండాలంటే రైతు కష్టంతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా ముఖ్యం. అందుకే కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగు లేస్తోంది. వైసీపీ సర్కారు హయాంలో ఉన్న పాత బకాయిలను విడుదల చేస్తూనే 2024-25 లక్ష్యాలను నిర్దేశించి నిధులు కేటాయిస్తోంది. ఈ విషయాలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎంవీ.సుబ్బా రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ (ఎంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై)లతోపాటు ఆయిల్ ఫాం పథకాల ద్వారా ప్రభుత్వం రాయితీలు అంది స్తున్నట్లు తెలిపారు. పండ్లు, కూరగాయలు, పూలతో టల పెంప కం ద్వారా అధిక ఆదాయం పొందేలా చర్యలు తీసుకుం టున్నట్లు చెప్పారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



సౌరశక్తి శీతల గది



ఎం.వి. సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద అధిక విలువ కలిగిన కూర గాయల సాగును ప్రోత్సహిస్తున్నారు. సాగులో ఆధునీక రణ పద్ధతులు, శాశ్వత పందిళ్ల, సేకరణ కేంద్రాలు, సౌరశక్తి శీతల గదు లను నిర్మించుకోవచ్చు. అదేవిధంగా పండించిన కూరగాయల రవాణాలో 20 శాతం పాడవు తాయి. వీటిని నివారించేం దుకు కోత తర్వాత శుభ్రం చేయ డం, శీతల గదుల్లో నిల్వ చేయడంతో పాటు శీతల సౌకర్యం ఉన్న వాహనాల ద్వారా రవాణా చేసుకునే అవకాశం ఉంది. అన్ని రకాల కూర గాయలు పండించడం, వాటికి గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. సంకరజాతి కాయగూరల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు హెక్టారుకు 40 శాతం రాయితీ కింద గరిష్ఠంగా రూ.20వేల వరకు అందిస్తారు. సోలార్ శీతల గడికి రూ.12.5 లక్షలు ఖర్చు అవుతుంటే 35 నుంచి 40 శాతం గరిష్ఠంగా రూ.4.3 లక్షల నుంచి 5లక్షల వరకు రాయితీ అందుతుంది.



కలెక్షన్ సెంటర్

శాశ్వత పందిళ్ల నిర్మా ణానికి హెక్టారుకు 50శాతం రాయితీ కింద గరిష్ఠంగా రూ.25 వేలు, సేకరణ కేంద్రానికి రూ.15లక్షల ఖర్చు అవుతుం టే రూ.5.2లక్షల నుంచి 6లక్షల వరకు రాయితీ అందుతుంది. విడిపూల సాగుకింద బంతి, చామంతి, గడ్డి సంపంగి తదితర పూల రకాల విస్తీర్ణాన్ని పెంచేం దుకు హెక్టారుకు 40శాతం రాయితీ కింద గరిష్ఠంగా రూ.16వేల రాయితీ లభిస్తుంది.

● ఆయిల్‌ఫాం సాగుకు

నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్ పథకం ద్వారా జిల్లాలో ఆయిల్ పాం సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తు న్నారు. జిల్లాకు ఎఫ్ఎఫ్ఎఫ్ ఆయిల్ పాం కంపెనీని కేటాయించింది. ఇండిజి నస్ ఆయిల్ పాం సాగుకు 4 సంవత్సరాలకు రూ.62వేలు, ఇంపోర్టెడ్ ఆయిల్ పాం సాగుకు రూ.71వేలు ఉద్యాన శాఖ ద్వారా రైతులకు రాయితీ అందిస్తారు.

పండ్ల తోటల సాగుకు..

పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచడమే ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్ పథకం (ఎంఐడి హెచ్) ముఖ్య ఉద్దేశం. పండ్ల తోటల పెంపకం, నిర్వహణ, తోటల పునరు ద్ధరణ, ప్యాక్ హౌస్, శీతల గదులు, సేకరణ కేంద్రాలు, యాంత్రీకరణ పరికరాలకు రాయితీ ఉంటుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు శిక్షణ ఉంటుంది. అదేవిధంగా మల్చింగ్, పక్షుల నుంచి పంట రక్షణకు నెట్ ఏర్పాటుకు రాయితీ ఉంటుం ది. నీటి కుంటలను నిర్మించుకో వచ్చు. నిమ్మ, మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్ తదితర పంటల విస్తీర్ణాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మూడేళ్లపాటు హెక్టారుకు నిమ్మకు రూ.16,004, మామిడి రూ.13,300, జామ రూ.29,331, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.30వేలు రాయితీ అందిస్తు న్నారు. టిష్యూ కల్చర్ కింద రెండేళ్లపాటు అరటికి రూ.40,985, బొప్పాయికి రూ.24,663 చొప్పున రాయితీ అందుతుంది. పంట ఉత్పత్తులను గ్రేడింగ్, క్లీనింగ్, ప్యాకింగ్ చేసేందుకు ఉపయోగపడే ప్యాక్ హౌస్‌కు గరిష్ఠంగా రూ.2 లక్షలు రాయితీ అందుతుంది. కలుపు నివారణ, కూలీల ఖర్చు తగ్గించడం, అధిక దిగుబడు లు పొందేందుకు ఉపయోగపడే మల్చింగ్ పద్ధతికి 50శాతం రాయితీ అందుతుంది. దుర్భిక్ష పరిస్థితుల్లో పండ్ల తోటలను రక్షించుకునేందుకు నీటికుంటల ఏర్పాటుకు ప్రత్యేక పథకం ఉంది. వ్యక్తిగతంగా నీటికుంట ఏర్పాటు చేసుకుంటే 50శాతం అంటే రూ.75 వేలు, కమ్యూనిటీ నీటికుంట ఏర్పాటుకు 100శాతం సబ్సిడీ ఉంటుంది. ఉద్యాన యాంత్రీకరణ కింద మినీట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, తైవాన్ స్ప్రేయర్లు వంటి యంత్ర పరికరాలకు సంబంధించి మహిళ, సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం, పెద్ద రైతులకు 40శాతం రాయితీ అందుతుంది.



జ్వర పీడితులను పరీక్షిస్తున్న కోవూరుపల్లి వైద్యులు

సీఎల్ పురంలో వైద్యశిబిరం

బిట్రగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచు లక్ష్మీపురంలో రోజురోజుకు విషజ్వరాలు పెరుగుతుండటంతో కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 70మందికి పైగా వైద్య పరీక్షలు చేయగా 10 మందికి జ్వరం ఉందని రక్త నమూనాలు సేకరించినట్లు వైద్యులు ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌లు తెలిపారు. మిగిలిన వారికి జ్వరం తగ్గి కీళ్లనొప్పులతో బాధపడుతున్నట్లు చెప్పారు. వారికి అవసరం అయిన మందులు ఇచ్చామన్నారు. టీడీపీ బోగోలు ఇన్‌చార్జి ముంతాల వెంకయ్య, గిరిజన నేత బోగిరి ప్రభాకర్‌లు వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్ఈవో మేరీ, సూపర్‌వైజర్ విక్టోరియా, ఏఎన్ఎంలు జ్యోష్ణ, సలోమి, ప్రసున్న, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కుడి కాలువకు మోటార్ల ఏర్పాటు

- 130 క్యూసెక్కుల నీటి విడుదల
- ప్రాజెక్టు డీఈ వెంకటేశ్వర్లు



తూము వద్ద మోటార్లు, పైపులను సిద్ధం చేస్తున్న అధికారులు

లింగసముద్రం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువకు రెండు మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గురువారం మెగా కంపెనీ ప్రతినిధులు తూము వద్దకు మూడు మోటార్లను తెచ్చారు. అయితే వాటిలో 75 హెచ్‌పీ మోటారు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడంతో 25 హెచ్‌పీ, 16 హెచ్‌పీ మోటార్ల ద్వారా 15 క్యూసెక్కుల మేర నీటిని సరఫరా చేస్తున్నట్లు డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. సైఫన్ పద్ధతిలో మరో పైపు ద్వారా ఇంకో 5 క్యూసెక్కుల నీరు కాలువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కాలువలో 130 క్యూసెక్కుల మేర నీరు సరఫరా అవుతున్నట్లు డీఈ తెలిపారు. శుక్రవారం మరో 3పైపుల ద్వారా సైఫన్ పద్ధతిలో నీరు కాలువకు విడుదల చేస్తామన్నారు. అధికారులు ఇంత చేస్తున్నా ఇసుకపాలెం వద్ద కాలువపై వేసిన అడ్డుకట్టలను లస్కర్లు ఉదయం తొలగించారు. మధ్యాహ్నం మరలా కాలువ నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకట్ట వేయించినట్లు ప్రాజెక్టు సిబ్బంది తెలిపారు.

బెల్టుషాపులను కట్టడి చేయాలి

- ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ



అధికారులతో సమీక్షిస్తున్న రాహుల్‌దేవ్ శర్మ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం బెల్టు దుకాణాలను పూర్తి స్థాయిలో కట్టడి చేయాలని, ఎక్సైజ్ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఎక్సైజ్ డీసీ కార్యాలయంలో గురువారం ఆయన ఎక్సైజ్ అధికారులతో సమీక్ష జరిపారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు. బెల్టు దుకాణాల నిర్వాహకులు, వారికి మద్యం సరఫరా చేసే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎంఆర్పీ ఉల్లంఘన, బ్రాండ్ మిక్సింగ్‌కు పాల్పడేవారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. సారా తయారీ, విక్రయాలు, రవాణాను నిర్మూలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం ఆయన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు, ఏసీ దయాసాగర్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఏ శ్రీనివాసులు నాయుడు, ఐఎంఎల్ డిపో మేనేజర్ ఆయుషాబేగం, ఏఈఎస్‌లు రమేష్, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం

- ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు కేరళకు తరలిన జట్టు

కావలి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీఎస్‌యూ పీజీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన వీఎస్‌యూ ఫుట్‌బాల్ జట్టు శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. వారంరోజులుగా పీజీ కళాశాల పీడీ మణికంఠ ఇన్‌చార్జిగా వ్యవహరించగా సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఎస్‌ఎ.నవీద్ జట్టుకు శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమానికి జేబీ డిగ్రీ కళాశాల సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్ మాల్యాద్రి ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను యూనివర్సిటీ సమకూర్చిన ట్రాక్‌షూట్, ఫుట్‌బాల్ షూస్, జెర్సీ, షార్ట్‌లను అందజేశారు. ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి వీఎస్‌యూకు పేరుతేవాలన్నారు. శనివారం నుంచి కేరళ రాష్ట్రం క్యాలికట్ (కోజికోడ్)లో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.



ఫుట్‌బాల్ జట్టు సభ్యులతో మాల్యాద్రి



బస్సుకు పచ్చజెండా ఊపుతున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, కోటంరెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, ఈడీ వెంకటేశ్వరరావు తదితరులు

ఆర్టీసీ సిటీ బస్సు ప్రారంభం

- 20 ఏళ్ల తర్వాత చిన్నచెరుకూరుకు సర్వీసు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)/తోటపల్లి గూడూరు డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని అయ్యప్పగుడి సెంటర్ నుంచి చిన్న చెరుకూరుకు ఆర్టీసీ సిటీ బస్సును గురువారం ప్రారంభించారు. నెల్లూరు-2 డిపో గ్యారేజీలో నెల్లూరు రూరల్, సర్వేపల్లి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పచ్చజెండా ఊపి బస్సును ప్రారంభించారు. సోమిరెడ్డి మాట్లాడుతూ జోనల్ చైర్మన్‌గా సురేష్‌రెడ్డి నాయకత్వంలో ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందా లని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, నెల్లూరు 1, 2 డిపోల మేనేజర్లు ఎం మురళీబాబు, శివకేశవ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తోటపల్లి గూడూరు మండలం చిన్నచెరుకూరు గ్రామానికి 20 ఏళ్ల నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. గ్రామస్తులు ఆటోల్లోనే ప్రయాణం చేస్తుండేవారు. అయితే, చిన్న చెరుకూరు గ్రామానికి చెందిన సురేష్‌రెడ్డి ఇటీవల ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఆ గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని స్థానికులు కోరారు. ఈ నేపథ్యంలో అయ్యప్పగుడి నుంచి సిటీ సర్వీసును ప్రారంభించి గ్రామస్తులతో కలసి సురేష్‌రెడ్డి బస్సులో ప్రయాణించారు. కార్యక్రమంలో నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు, బీజేపీ నాయకులు అన్నం శ్రీనివాసులు, తుళ్లూరు జనార్దన్, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లు, నక్క సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి టాస్క్‌ఫోర్స్

- కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం
- రెవెన్యూ, పోలీసు అధికారులతో కమిటీల ఏర్పాటు
- తొలుత మండల స్థాయిలో నియామకం
- ఆ తర్వాత డివిజన్, జిల్లా స్థాయిలో ఏర్పాటు

నెల్లూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా భూ సమస్యలు పెరిగిపోయాయి. రాజకీయ బలంతో బలహీనుల భూములను లాక్కుకున్నారు. కొందరు రికార్డులు మార్చేసి ఇతరుల భూముల్లోకి చొరబడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రతీ వారం గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీల్లో సగానికిపైగా భూ సమస్యలే ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగానే రీసర్వే జరిగిన గ్రామాల్లో తొలుత గ్రామసభలు నిర్వహించింది. ఈ సభల్లో కుప్పలు తెప్పలుగా అర్జీలు వచ్చాయి. వీటిని చూశాక ఆ తర్వాత అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోంది. ఇక్కడ కూడా తమ భూములను లాక్కున్నారన్న అర్జీలు వస్తున్నాయి. అయితే ఈ సమస్యల పరిష్కారంలో మాత్రం ఆశించినంత పురోగతి కనిపించడం లేదు. దీంతో బాధితులు మళ్లీ అదే అర్జీలతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

తొలుత మండల టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

రెవెన్యూ, పోలీసు శాఖలతో ముడి పడి ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ కమిటీలను నియమించాలని ఆదేశించింది. అందులో భాగంగా తొలుత మండల స్థాయిలో తహసీల్దార్, ఎస్సైలతో టాస్క్‌ఫోర్స్ కమిటీను ఏర్పాటు చేస్తున్నాం. ఈ కమిటీలు ఎప్పటికప్పుడు అందుతున్న ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తాయి.

- కే కార్తీక్, జాయింట్ కలెక్టర్

● ఒకరిపై మరొకరు చెప్పుకుంటూ..

భూ వివాదాల పరిష్కారంలో అటు రెవెన్యూ, ఇటు పోలీసు శాఖలు ఎవరికి వారు తమ పరిధి కాదంటూ తప్పించుకుంటున్నారు. ఒక వ్యక్తి తన భూమిని మరొకరు భయపెట్టి ఆక్రమించారని ఫిర్యాదు చేస్తే రెవెన్యూ శాఖ లాఅండ్‌ఆర్డర్ సమస్యగా చూపిస్తుండగా, పోలీసు శాఖ మాత్రం సివిల్ వివాదంగా చూపిస్తోంది. క్షేత్రస్థాయిలో ఈ రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో బాధితులకు న్యాయం జరగడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ ఆలోచనను ముందుకు తెచ్చింది. ఇటు సివిల్, అటు క్రిమినల్ వ్యవహారాలు ముడిపడి ఉన్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ, పోలీసు శాఖలతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రధానంగా భూ ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారాలను ఈ కమిటీ సమీక్షిస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వచ్చే వివాదాలన్నిటినీ ఈ కమిటీకి పంపుతారు. తహసీల్దార్, ఎస్సైలు క్షేత్రస్థాయిలో సంయుక్తంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తారు. ఇక్కడ కూడా పరిష్కారం కాని సమస్యలు రెండో దశలో డివిజన్ స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీల దృష్టికి వెళతాయి.



రోజంతా ముసురు

దీనికితోడు చల్లని గాలులు వీచడంతో ప్రజలు వణికిపోయారు. నగరంలో అడపాదడపా వర్షం కురవడంతో వ్యాపారులు అవస్థలు పడ్డారు.

నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

నెల్లూరు : మాగుంట లేఅవుట్‌లో కమ్ముకున్న మబ్బులు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతా ముసురు పట్టుకుంది. గురువారం ఉదయం నుంచి అక్కడక్కడ చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది.





వాన వస్తోంది.. పరుగో పరుగు!



యూరియా వచ్చింది.. అయిపోయింది..

మండల కేంద్రంలోని కోఆపరేటివ్ సొసైటీ, పడమర పీఏసీఎస్‌లో వద్ద రైతులు యూరియా కోసం వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. ప్రస్తుతం వరి పంటలకు యూరియా అవసరం ఉండటంతో పనులు వదలుకుని సంఘాల వద్ద నిరీక్షిస్తున్నా అధికారులు స్టాకు లేదని చెబుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురు వారం రెండు సొసైటీలకు యూరియా వచ్చిందని తెలియడంతో రైతులు ఎగబడ్డారు. అధికారులు మాత్రం ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి వరుసక్రమంలో ఇస్తున్నారు. బయటి మార్కెట్లో యూరియా బస్తా ధర రూ.360 పలుకుతుండగా సొసైటీల్లో రూ.270లకే వస్తుంది. ఇదిలా ఉండగా రైతులకు అవసరమైన మేర యూరియా పంపిణీ చేయాల్సిన అధికారులు ఏక మొత్తంలో కొంతమందికి మాత్రమే అందజేసి స్టాకు అయిపోయిందని చెప్పడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో జేసీ కార్తీక్, పరిశ్రమల శాఖ అధికారులు

పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులివ్వాలి

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల పురోగతి, పీఎంఈజీపీ రుణాల మంజూరు, క్లస్టర్ల అభివృద్ధి తదితర విషయాలను పరిశ్రమల శాఖ జీఎం ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే అనుమతులివ్వాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న బంగారం, ప్రింటింగ్, రెడిమేడ్ క్లస్టర్ల డెవలప్‌మెంట్ ప్రోగ్రాంపై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, ఏపీఐఐసీ అధికారులు శేఖర్‌రెడ్డి, వెంకట సురేష్, శ్రీధర్‌రెడ్డి, శ్యామియేల్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నుడా ప్రతిష్ఠను పెంచండి : చైర్మన్ కోటంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి, చిత్రంలో వీసీ సూర్యతేజ

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) ప్రతిష్ఠను పెంచేలా ప్రతి అధికారి పని చేయాలని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనువాసులు రెడ్డి సూచించారు. వీసీ సూర్యతేజతో కలిసి నుడా కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. అక్రమ లేఅవుట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేలా ప్రణాళి కలు రూపొందించాలని ఆదేశించారు. నెక్లెస్ రోడ్డు, పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను సకాలంలో పూర్తిచేసేలా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులపై నివేదిక తయారు చేస్తే మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళతానని చెప్పారు. వీసీ సూర్యతేజ మాట్లాడుతూ నుడా పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామన్నారు. నగరవాసులందరికీ నుడా ద్వారా ప్రత్యేక సేవలు అందిస్తామని తెలిపారు.



ఫ్రీ వాటర్ సర్వీస్

నెల్లూరులోని హరనాథపురం కూడలిలో కార్పొరేషన్ నీటి పైపు లైన్ లీకవుతోంది. దాని నుంచి నీరు రోడ్డు మీదకు విరజిమ్ముతోంది. అటుగా వెళుతున్న ఓ ఆటోను లీకేజీ ప్రాంతంలో నిలపడంతో చూపరులకు ఫ్రీ వాటర్ సర్వీస్‌లా కనిపిస్తోంది.

- ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	105
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7306
వెండి కిలో ధర	రూ. 89,300
వెండి ఒక గ్రాము	రూ.92.30

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

వెంకటాచలం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలో బుజబుజనెల్లూరు సమీపంలో ఉన్న మద్యం దుకాణంలో మూడు నెలల కిందట జరిగిన చోరీ కేసులో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. సెప్టెంబరు 6న మద్యం దుకాణంలో చోరీ జరగగా గతంలోనే ఆ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. అయితే మూడవ నిందితుడైన నెల్లూరు నగరం వనంతోపు సెంటర్‌కు చెందిన కంచు విష్ణును గురువారం సీఐ సుబ్బారావు అరెస్టు చేసి నిందితుడి వద్ద రూ.40 వేలు రికవరీ చేశారు. అరెస్టు చేసిన నిందితుడిని కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

మీసేవ నాడు ఘనం... నేడు దైన్యం

● వైసీపీ హయాం నుంచి గడ్డుకాలం
● సచివాలయ వ్యవస్థతో నిర్వీర్యం
● ఆదాయం లేక ఆపరేటర్ల అవస్థలు
● కూటమి ప్రభుత్వంలోనూ అంతే...

కేంద్రాలు మూయలేక, నడపలేక అయోమయం



సంగంలోని మీ సేవ కేంద్రం

సంగం, డిసెంబరు 19: నాడు ప్రజలకు ఏ సర్టిఫికెట్ కావాలన్నా మీసేవ కేంద్రాల వద్దకు పరుగులు తీసేవారు. విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు, బర్త్, డెత్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, భూ రికార్డులు అడంగల్, 1బీ పొందాలన్నా, నీటి పన్ను, విద్యుత్, టెలికం బిల్లులు చెల్లించాలన్నా ఆ కేంద్రాలే గుర్తుకు వచ్చేవి. అవన్నీ గత టీడీపీ ప్రభుత్వం హయాంలో జరిగాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మీ సేవ కేంద్రాలను నిర్వీర్యం చేసింది. సచివాలయ వ్యవస్థతో ఈ కేంద్రాలు ఆదరణ కోల్పోయాయి. దీంతో ఆపరేటర్లు అటు కేంద్రాలను నడపలేక, ఇటు మూయలేక అయోమయంలో పడ్డారు. నేడు మీసేవ కేంద్రాలు దైన్యస్థితిని ఎదుర్కొంటున్నాయి.

● **2011లో ఏర్పాటు**

2011లో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్, టీసీఎస్ భాగస్వామ్యంలో మీసేవ కేంద్రాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2014లో చంద్రబాబు అధికారంలో వచ్చాక వీటి ప్రాధాన్యత పెరిగింది. పరిమితంగా ఉన్న సేవలను 350 వరకు పెంచారు. దీంతో మీసేవ కేంద్రాలు కీలకంగా మారా యి. ఆపరేటర్లకు చేతినిండా పని ఉండేది. వారి జీవనం సాఫీగా జరిగేది.

● **సచివాలయాల రాకతో నిర్వీర్యం**

2019లో గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాక మీ సేవ కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. ప్రభుత్వ సర్వీస్‌లన్నీ సచివాలయంలోనే అప్‌లోడ్ చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో ప్రతి ఒక్కరూ సచివాలయాల బాట పడ్డారు. మీ సేవ కేంద్రాలకు వెళ్లే వారు కరువయ్యారు. గతంలో రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, ఆస్తులు, వ్యవసాయ భూముల కొనుగోలులో మ్యూటేషన్ పత్రాలు కూడా మీ సేవ కేంద్రాల్లో జారీ చేసేవారు. సచివాలయాల రాకతో అవన్నీ మాయమయ్యాయి. ఆదాయం లేక వీటిని కొందరు మూసేశారు. మరి కొందరు మూయలేక, నడపలేక అయోమయంలో ఉన్నారు.

● **కూటమి ప్రభుత్వంలోనూ అంతే..**

గత ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో లోకేష్‌ను మీ సేవ ఆపరేటర్లు కలిశారు. మీసేవలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం వస్తే సచివాలయ వ్యవస్థ రద్దు చేస్తారని ఊహాగానాలు వినిపించాయి.అదే జరిగితే మీ సేవ కేంద్రాలు పూర్వ వైభవం సంతరించుకుంటాయని నిర్వాహకులు భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. దీంతో నిర్వాహకులు అప్పుడు.. ఇప్పుడు అంతేనంటూ పెదవి విరుస్తున్నారు.

23న మెగా జాబ్‌మేళా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాల, వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఈ నెల 23వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీసిటీలోని బ్లూస్టార్స్ క్లైమాటెక్ లిమిటెడ్‌లో 40 ఆపరేటర్ పోస్టులకు, శ్రీ సిటీలోని డైకిన్ కంపెనీలో 30 ఆపరేటర్ పోస్టులకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. నెల్లూరులోని ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ అసోసియేట్ పోస్టులకు, చిత్తూరు లోని అమర్‌రాజ బ్యాటరీస్‌లో 200 మిషన్ ఆపరేటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. క్రిస్ ఫైనా న్షియల్ లిమిటెడ్‌లో లోన్ ఆఫీసర్స్, బ్రాంచి క్వాలిటీ మేనేజర్స్ 30 పోస్టులకు, భార్గవి ఆటోమొబైల్స్‌లో సర్వీస్, సేల్స్ విభాగాల్లో పనిచేసేందుకు 50 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని తెలిపా రు. నెల్లూరులోని అపోలో ఫార్మశీలో ఫార్మాసిస్ట్, ఫార్మసీ ట్రైనీస్ 30 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహి స్తారన్నారు. అర్హత, ఆసక్తి గల వారు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో ఆ రోజు ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ శిక్షణ కళాశాల పరిశీలన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం మండలం కాకుటూరులో ఉన్న ఆర్టీసీ నెల్లూరు జోనల్ సిబ్బంది శిక్షణ కళాశాలను సంస్థ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి గురువారం పరిశీ లించారు. ప్రైవేటు అద్దె బస్సులు, ఆన్‌కాల్ డ్రైవర్లకు జరుగుతున్న ప్రత్యేక శిక్షణలో పాల్గొని డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం అధికారు లతో సమావేశమయ్యారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆర్టీసీలో తప్పనిసరిగా చేపట్టాలని, కార్యాలయం, ఇతర ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్గో సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదని అభిప్రాయపడ్డారు. విద్యుత్ వాహనాల వినియోగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం

నెల్లూరు రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని దేవరపాళెం గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతూ మంగళవారం అదృశ్యమైన విద్యార్థి పత్రా శీను ఆచూకీ లభ్యమైనట్లు రూరల్ సీఐ జీ వేణు గురువారం తెలిపారు. బాపట్లలోని అతని బంధువుల ఇంట్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. బాలుడిని తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించే ప్రక్రి య జరుగుతోందని తెలిపారు. బాలుడు పాఠశాల నుంచి అదృశ్యమైనట్లు అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేసిన విషయం విదితమే.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపాల్ విజయ, ఇతర అధ్యాపకులు

వీఎస్‌యూలో పుస్తకావిష్కరణ

వెంకటాచలం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో గురువారం విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పూర్తి సమాచారాన్ని కలగలిపిన పుస్తకాన్ని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం విద్యార్థులకు మంచి మార్గదర్శకంగా ఉంటుందన్నారు. ఈ పుస్తకంలో యూనివర్శిటీలో అందుబాటులో ఉన్న అన్ని కోర్సులు, వనరులు, సదుపాయాలు, అవకాశాలను పొందుపరచామన్నారు. ఇది నూతనతరం విద్యార్థులకు మంచి ప్రేరణగా నిలుస్తుందన్నారు. భవిష్యత్తులో మరింత ఉపయోగకరమైన సమాచార సదుపాయాలను అందించేందుకు వీఎస్‌యూ కృషి చేస్తుందన్నారు. వీఎస్‌యూ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ఒక మంచి పుస్తకాన్ని ఆవిష్కరించామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ మధుమతి, అధ్యాపకులు డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, డాక్టర్ కోటనీల మణికంఠ, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ త్రివేణి, శ్రీకన్యరావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయండి

● ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి



మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు ప్రతి ఎన్జీవో కృషి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి కోరారు. గురు వారం నెల్లూరులోని నవజీవన్ అర్గనైజేషన్ ప్రోగ్రమాటిక్ పాపులేషన్ అండ్ సైజ్ ఎస్టిమేషన్ (పీఎంపీ ఎస్‌ఈ) జిల్లా శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్క ఎన్జీవో క్షేత్రస్థాయిలో పర్యటించి హెచ్‌ఐవీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌ఐవీ సోకిన వారు రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవటం వంటి లక్షణాలతో బాధపడుతుంటే వారందరికీ కఫం పరీక్షలు నిర్వహించాలని తెలియచేశారు.

ఐసీడీఎస్ ఏపీడీగా సుశీలాదేవి



సుశీలాదేవి

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా సీహెచ్ సుశీలాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఐసీడీఎస్‌లో అవినీతికి తావు లేకుండా సేవలు అందిస్తామని తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురి డీబార్

వెంకటాచలం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్శిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో గురువారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలలో ఏడుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధి కారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 8,491 మంది విద్యార్థులకు గాను 7,757 మంది హాజరు కాగా 734 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. నెల్లూరులోని వీఆర్ ఐఏఎస్ కళాశాలలో ఇద్దరు, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఇద్దరు, చంద్రారెడ్డి డిగ్రీ కళాశాలలో ఒకరు, శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒకరు, వెంకటగిరిలోని ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడి డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

'సోమశిల'లో 72.647 టీఎంసీల నిల్వ

అనంతసాగరం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 3,200 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 72.647 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1550, కండలేరుకు 1,200, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వారు తెలిపారు.

బినామీ మస్టర్లకు చెక్

● జిల్లాస్థాయిలో వేజ్ మానిటరింగ్ సెల్
● నిరంతర తనిఖీలు, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ
● సగటు వేతనం రూ.300 దక్కేలా చర్యలు

ఉదయగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా బినామీ మస్టర్లకు చెక్ పెట్టి ఉపాధి కూలీలకు దినసరి కూలీ పెంచేలా చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం కూలీలకు చెల్లిస్తున్న రూ.265 నుంచి రూ.300కు పెంచడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. కూలీల పని వేళల్లో మార్పులు చేసి గిట్టుబాటు వేతనం లభించేలా వేజ్ మానటరింగ్ విభాగాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ విభాగానికి డ్వామాలో కీలకంగా ఉండే జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది. కూలీలు ప్రస్తుతం చేస్తున్న నాలుగు గంటల పనిని అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బందితో పాటు ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్టర్లను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి చర్యలతో కూలీలకు సగటున రూ.300 వేతనం లభించే వీలుంటుదని ప్రభుత్వం భావిస్తోంది. దినసరి కూలి రూ.300 పడాలంటే ఏయే పనులు, ఎంత సమయం పని చేయాల్సి ఉంటుందనే అంశాలపై జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన వేజ్ మానటరింగ్ సెల్ పరిశీలిస్తుంది.

● **జిల్లాస్థాయిలో పర్యవేక్షణ విభాగం**

ఈ పథకంలో బినామీ మస్టర్లకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లాస్థాయిలో పర్యవేక్షణ విభాగం(వేజ్ మానిటరింగ్ సెల్) ఏర్పాటు చేసింది. కూలీలు పనులకు రాకపోయినా హాజరైనట్లుగా కొందరు సిబ్బంది మస్టర్లు వేసి వేతనాలు స్వాహా చేస్తున్నారు. దీంతో వేతన దినాలు దుర్వినియోగం కావడంతోపాటు పనులకు హాజరైన కూలీలకు పూర్తిగా వేతనం అందడంలేదు. ఇలాంటి వారిని అడ్డుకోవడానికి ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి పర్యవేక్షణ బాధ్యత జిల్లా విజిలెన్స్ విభాగానికి సమన్వయం చేస్తారు.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

బినామీ మస్టర్ల నిరోధానికి చర్యలు

బినామీ మస్టర్ల నిరోధానికి ప్రభుత్వం వేజ్ మానటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం ఏపీడీలు, ఎంపీడీవోలు, ఏపీవోలు వారంలో రెండు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి మస్టర్లను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని సూచించాం. ఈ నివేదిక ప్రకారం ఎవరు పనికొచ్చారు, ఎవరు రాలేదని అంశాన్ని గుర్తించి చర్యలు చేపడతాం.

-గంగాభవాని, డ్వామా పీడీ

కేంద్ర మంత్రులకు ఎంపీ వేమిరెడ్డి వినతులు

న్యూఢిల్లీ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు కేంద్ర మంత్రులకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో భేటీ సందర్భంగా బిట్రగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కందుకూరులో నిరుపయోగంగా ఉన్న ఖాదీ కార్యాలయం స్థానంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు కోరుతూ కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల మంత్రి జితిన్‌రామ్ మాంఝీకి విన్నవించారు. విడవలూరు మండలం పొన్నపూడి పాటూరులో ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు కోరుతూ కేంద్ర మత్స్య, పశుసంవర్థక మంత్రి రాజీవ్ రంజన్ సింగ్‌ను కలిసి ఎంపీ వినతి పత్రం అందించారు. అలాగే ఓబీసీ లబ్ధిదారులకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఇస్తున్న డీప్‌సీ బోట్లకు సబ్సిడీని పెంచాలని కోరారు. నెల్లూరులో ఈఎస్ఐ ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మిక, ఉపాధికల్పన మన్‌సుఖ్ మాండవీయకు ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తి చేశారు. చిరమణ పిన్‌కోడ్ 524308ను కొనసాగించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. చిరమణకు 524308ను కొనసాగిస్తూ కేంద్ర మంత్రి ఆదేశాలు జారీ చేశారని ఎంపీ వేమిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

న్యూస్ బాక్స్

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి

ఉదయగిరి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక రేడియన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమరయోధులు అష్ఫాఖుల్లా ఖాన్, పండిత్ రాంప్రసాద్‌బిస్మిల్‌ల వర్ధంతిని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మసూద్, ఆవాజ్ కమిటీ సభ్యులు నజర్‌బాషా, హీనా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బొల్లినేని సురేంద్రకు..

కలిగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు చిన్న కుమారుడు, సోషల్ మీడియా సైనికుడు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుడు బొల్లినేని సురేంద్ర అకాల మరణం కలిచివేసినట్లు మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన పెద్దపాడుకు వెళ్లి సురేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం సురేంద్ర తండ్రి రామారావును పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, మొక్క హజరత్ బాబు, పొన్నగంటి శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రతిభా విద్యార్థికి అభినందన

కావలి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో కావలిలో నిర్వహించిన బ్లాక్‌లెవెల్ క్రీడా పోటీల్లో స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థి నవదీప్ ప్రతిభ చూపాడు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ లుకోధర్ అధ్యక్షతన జరిగిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకయ్య, డైరెక్టర్లు కొండయ్య, పీవీఎస్ ప్రసాద్, కళాశాల గౌరవ సలహాదారుడు నందనవనం మధుసూదన్‌రావు, పీడీ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు నవదీప్‌కు బొకే, మెమొంటో అందించి అభినందించారు.

డీఈవో కేజీబీవీ తనిఖీ

కలిగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాధికారి బాలాజీరావు గురువారం స్థానిక కేజీబీవీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి విద్యార్థినుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. రానున్న 10వ తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కేజీబీవీ ప్రిన్సిపల్ సుప్రియ ఉన్నారు.

మెటీరియల్ పంపిణీ

వలేటివారిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శాఖవరం హైస్కూల్‌లోని 10వ తరగతి విద్యార్థులకు గురువారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ టీచరు వీ.ఎస్ లక్ష్మీనారాయణ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేసిన లక్ష్మీనారాయణకు టీచర్లు అభినందించారు.

22 నుంచి స్పాట్ వ్యాల్యుయేషన్ క్యాంప్

కందుకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నుంచి ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం థర్డ్ సెమిస్టర్ డిగ్రీ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ క్యాంప్ ప్రారంభం అవుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరయ్యే అధ్యాపకులు విధిగా యూనివర్సిటీ జారీ చేయబడిన గుర్తింపుకార్డుకు ఫోటో అతికించి సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం తీసుకుని రావాలని పేర్కొన్నారు.

రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు

వలేటివారిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో సూక్ష్మ నీటి సేద్యంపై గురువారం రైతులకు అగాహన కార్యక్రమం నిర్వహించారు. 5ఎకరాలలోపు రైతులకు 90శాతం రాయితీపై డ్రిప్ అందించనున్నట్లు తెలిపారు. రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ ప్రతినిధులు నరేష్, మహేంద్ర, ఈపీసీ కంపెనీ ప్రతినిధి శ్రీహరి, ఏఓ హేమంత్ పాల్గొన్నారు.

టెలికం అడ్వయిజరీ బోర్డు డైరెక్టర్‌కు అభినందన

లింగసముద్రం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా టెలికం అడ్వైజరీ బోర్డు డైరెక్టర్ గుర్రం మాల్యాద్రిని గురువారం అభినందించినట్లు టీడీపీ నాయకులు అడపా రంగయ్య, పూరిమిట్ల మాల్యాద్రిలు గురువారం ప్రకటనలో తెలిపారు. మాల్యాద్రిని డైరెక్టర్ గా నియమించడంలో సహకరించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

రికార్డుల తనిఖీ

వలేటివారిపాలెం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంను గురువారం ప్రకాశం జిల్లా గ్రంథాయల సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సొంత భవనం నిర్మాణానికి స్థలం సేకరించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లింది. అక్కడ ఎంపీడీఓ నరేంద్రదేవ్, ఈఓఆర్డీ అబ్దుల్ లేకపోవడంతో నెల్లూరు జిల్లా డీఎల్‌పీఓతో మాట్లాడింది. గ్రంథ పాలకుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ తాత్కాలిక వంతెన!



ప్రమాదకరంగా ఉన్న తాత్కాలిక వంతెన

కలిగిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిర్రావారిపాలెం వద్ద గొట్టిపాటి కొండపనాయుడు ఉత్తరకాలువ (సోమశిల ఉత్తరకాలువ)పై నిర్మించిన తూములు వేసి ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన మార్గం ప్రమాదకరంగా మారింది. ఈ కాలువ కలిగిరి, కొండాపురం మండలాలకు అనుసంధానంగా రాళ్లపాడు రిజర్వాయర్ వరకు వెళుతుంది. ఈ కాలువ నిర్మాణం జరుగుతున్నపుడు కాలువకు ఆవలివైపున 500ఎకరాలు పంట పొలాలు ఉన్నాయని ఆ పొలాలకు వెళ్లాలంటే కాలువపై వంతెన నిర్మించాలని పనులు అడ్డుకున్నారు. వంతెన నిర్మించాలని పట్టుబడితే అప్పట్టి ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు చొరవతో ఒక వరుసలో ఎనిమిది తూములను ఏర్పాటు చేసి పైన మట్టి వేయించి తాత్కాలిక ఇబ్బందులు లేకుండా చేశారు. అయితే వర్షాకాలంలో నీరు ప్రవహించేటపుడు తూముల వద్ద చెత్తచె దారం, జంతుకళేబరాలు అడ్డుపడి నీరు వెళ్లడం లేదు.

● ఇద్దరు ఎమ్మెల్యేల పరిశీలన..

ఈ క్రమంలో నాలుగునెల క్రితం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులతో వంతెనను పరిశీలించి శాశ్వత నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయమని తెలిపారు. వంతెన వద్ద నీరు వెళ్లడానికి రెండోవరుసలో మరో ఎనిమిది తూములను ఏర్పాటు చేశారు.

● రెండునెలల కిందట ఉత్తరకాలువకు నీరు వదిలినపుడు స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వంతెనను పరిశీలించారు. జిర్రావారిపాలెం ప్రజలు ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి ఈ తీసుకొచ్చారు. ఆయన కూడా వంతెన వద్ద శాశ్వత నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

ఇటీవల కురుస్తున్న వర్షాలతో..

గత 20రోజులుగా పడుతున్న వర్షాలకు తూములపై వేసిన మట్టి కొట్టుకుపోయింది. వంతెన ప్రాంతమంతా బురమయంగా మారింది. ఈ మార్గం ద్వారా గుండా తాము పొలాలకు వెళ్లలేకపోతున్నామని ఈ గ్రామాల పరిసరాల ప్రజలు వాపోతున్నారు. తాత్కాలిక వంతెన నిర్మాణ మార్గం ద్వారా వెళ్లలేకపోతే గ్రామం చుట్టూరా మూడు కిలోమీటర్లమేర తిరిగి పొలలకు వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ఎన్నిసార్లు ఉత్తర కాలువ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. కాంక్రీటు నిర్మాణంతో ఉత్తర కాలువపై వంతెన ఏర్పాటు చేస్తే తాము పడుతున్న సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు.

పదేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం..



కాలువ ఆవలివైపున 500ఎకరాలు పంటు పొలాలు ఉన్నాయి. వర్షాకాలం వస్తే పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వంతెన నిర్మాణం చేపట్టాలని అధికారుల చుట్టూరా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. సమస్యపై ఉదయగిరి, కందుకూరు ఎమ్మెల్యేలు స్పందించాలి.

- జిర్రా పెద్ద అంకిరెడ్డి, జిర్రావారిపాలెం

తాత్కాలిక వంతెనతో ప్రమాదమే..



కావలి-ఉదయగిరి ప్రధాన రహదారి సమీపంలోని జిర్రావారిపాలెం ఉత్తర కాలువపై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెనతో ప్రమాదం పొంచి ఉంది. ఈ మార్గం గుండా మహిళలు, చిన్నారులు, వృద్ధులు వృద్ధులు వెళ్లేందుకు ఇబ్బందులు పడతారు. కాంక్రీట్ నిర్మాణంతో శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలి.

- పులి మదన్‌మోహన్‌రెడ్డి, జిర్రావారిపాలెం

సీహెచ్‌సీ అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే కాకర్ల



టీడీపీ నేతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) అభివృద్ధికి అన్నీ చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే, హెచ్‌డీఎస్ కమిటీ చైర్మన్ కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక వైద్యశాలలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సుదూర ప్రాంతంలో ఉన్న ఈ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది కొరత తీర్చేందుకు, ఇప్పటికే ఉన్నతాధికారులతో మాట్లాడామన్నారు. మెట్ట ప్రాంతం కావడంతో పేదలు అధికంగా ప్రభుత్వ వైద్యశాలకు వస్తుంటారని తెలిపారు. వారిని దృష్టిలో ఉంచుకొని వైద్యశాలలో అన్నీసేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వైద్య శాలలో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై వైద్యులతో చర్చించారు. పారిశుధ్యం సమస్య తలెత్తకుండా చూడాల న్నారు. అనంతరం సమావేశంలో చేపట్టిన, చేప ట్టాల్సిన అభివృద్ధి పనులను సభ్యు లకు చదివి వినిపించారు. కార్యక్రమంలో డీడీవో అనీషా, వైద్యులు సింధూర, ప్రశాంత్, ఎంపీడీవో అప్పాజీ, ఈవో కరీముల్లా, హెచ్‌డీఎస్ సభ్యురాలు కలివెల జ్యోతి, టీడీపీ నేతలు బయ్యన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సీతారామపురం : పేదవారు ఆపదలో ఉన్నప్పుడు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. వింజమూరులోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆసుపత్రి ఖర్చుల కోసం బాధితులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మండలపరిధిలోని నాంచారమ్మపల్లెకి చెందిన కంచెంరెడ్డి జస్విక రెడ్డికి రూ.3,39,075ల చెక్కును, సీతారామపు రానికి చెందిన దూదేకుల హాజరత్‌కు రూ.75,000ల చెక్కును అందజేశారు. కార్యక్రమం లో టీడీపీ మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, ఎడమ ప్రవీణ్,విక్కి బాబు, దేవర వెంకటే శ్వర్లు,శేఖర్ పాల్గొన్నారు.

నేర నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలి



సంగం: మైక్‌లో ప్రచారం చేస్తున్న పోలీసులు

కావలి రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ రాజేశ్వరరావు తెలిపారు. గురువారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో నేర నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆటోలకు మైకులు పెట్టి ప్రచారం చేయించారు. ఇళ్లను వదిలి ఎవరైనా ఊర్లకు వెళ్తే బంగారు ఆభరణాలు బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. ఊర్లకు వెళితే పోలీసులకు తెలిపితే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. బంగారు ఆభరణాలకు మెరు గుపెడతామని కొత్త వ్యక్తులు వచ్చి అడిగితే పోలీసులకు సమాచారం తెలపాలన్నారు. కొత్త వ్యక్తులు ఫోన్ చేసి మేము బ్యాంకు వాళ్లమని తెలిపి ఆధార్, ఏటీఎం నెంబర్లు అడిగినా చెప్పరాదన్నా రు. అలాగే అతి తక్కువ ధరకు ఏమైనా వస్తువులు అమ్మితే కొనరాదన్నారు. ఇళ్ల సమీపంలో ఏమైనా జూదం, ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా 100నెంబరుకు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇంటి పరిసరాల్లో బయట దొంగలకు ఉపయోగ పడే గడ్డపారలు, రాడ్లు, కర్రలు ఉంచరాదన్నారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామా ల్లో ప్రజలు క్రిస్మస్, సంక్రాంతిలకు ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం) సేవలను వినియోగించుకోవాలని గురువారం పోలీసులు ప్రచారం చేశారు. తీర్థ, విహార యాత్రలకు వెళ్లే వారు ముందుగా పోలీసులకు సమాచారం అందిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను అందచేస్తారని ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

దళిత సంఘాల నాయకుల నిరసన



కందుకూరులో నిరసన తెలుపుతున్న దళిత, బహుజన సంఘాల నేతలు



కావలి: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘర్షణ సమితి నేతలు

కందుకూరు: కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని దళిత బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కందుకూరుని అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో వివిధ సంఘాల నేతలతో కలిసి అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కళ్లగుంట మోహనరావు, గేరా చిరంజీవి, అబ్దుల్లా, వీరనారాయణ, గాండ్ల హరిప్రసాద్, రేణమాల అయ్యన్న, పాలేటి కోటేశ్వరరావు, బొట్లగుంట శ్రీను, గుంటక మల్లికార్జున ఉన్నారు.

● కావలి: పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించిన వారు జాతికి క్షమాపణ చెప్పాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక ట్రంకురోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘర్షణ సమితి సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సమితి నేతలు ఆలూరి బ్రహ్మయ్య, జరుగుమల్లి విజయరత్నం, రమేష్, జనార్దన్, తిరుపతి పాల్గొన్నారు.

● అల్లూరు: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను విమర్శిస్తూ బీజేపీ కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యసభలో మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధం అని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై కేంద్రం స్పందించి చర్యలు తీసువాలని డిమాండ్ చేశారు.

● ఉలవపాడు: కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి హోం మంత్రి పదవి నుంచి తొలగించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి ఆర్ మోహన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చట్టసభల్లో బీజేపీ తన ఆర్‌ఎస్‌ఎస్, మనువాద సంస్కృతిని చాటుకుం దని వాపోయారు. ఇదే తరహాలో అంబేద్కర్‌పై విషం కక్కితే దళిత, బడుగు, బలహీన వర్గాలు, ప్రజాసామ్య విప్లవశక్తులు ఏకమై మనువాద ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కోటాయపల్లిలో గురువారం తహసీల్దారు సుభద్ర రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వీఆర్వో అంజాద్ పాల్గొన్నారు.

● దుత్తలూరులో: మండలంలోని లక్ష్మీపురంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. సదస్సులో ప్రత్యేకాధికారి బాలాజీరావు, తహసీల్దారు వై.నాగరాజు ప్రజలు, రైతులన నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం: మర్రిపాడులో సదస్సులో డీటీ సంధ్య పాల్గొని అక్కడికక్కడే కొన్నింటిని పరిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రాజనారాయణ, వీఆర్వో గిరి, రైతులు పాల్గొన్నారు.

● సీతారామపురం: గ్రామ పంచాయతీలోని బీట్-1సచివాలయంలో గురువారం తహసీల్దార్ కృష్ణారెడ్డి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, సర్వేయర్ భాగ్యలక్ష్మి, వీఆర్వో ఖజామొద్దిన్, సర్పంచి భాగ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం: భీమవరప్పాడులో జరిగిన సదస్సుకు 4వినతులు వచ్చినట్లు తహసీల్దార్ ఎమ్.కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● గుడ్లూరు: స్థానిక పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో 29అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దారు స్వర్ణ తెలిపారు. అందులో ఇళ్లస్థలాల కేటాయింపుకు 21 అర్జీలు, వివిధ రకాల భూ సమస్యలపై 8అర్జీలు ఉన్నట్లు చెప్పారు. కార్య క్రమంలో ఎండోమెంట్ ఈవో, వీర్వోలు చలమా రెడ్డి తిరుపాలు, సర్పంచ్ పాలకీర్తి శంకర్, గ్రామ నాయకులు ఉన్నం వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డి మహేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు గంటె నపల్లి వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, పాలకీర్తి నాగేశ్వర రావు, అంజయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.



గుడ్లూరు: రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దారు స్వర్ణ

పోలీసుల యోగాసనాలు

ఆత్మకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేషన్ ప్రాంగణంలో పోలీసులు గురువారం యోగాసనాలు నిర్వహించారు. సీఐ గంగాధర్ పోలీసులు, చిన్నారులు ఆసనాలు సాధన చేయించారు.

● సంగం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పోలీసులు యోగా చే శారు. యోగా గురు వు పెంచలయ్య వారితో పలు యోగాసనాలు సాధన చేయించా రు. కార్యక్రమంలో సంగం, చేజర్ల ఎస్‌ఐలు రాజేష్, సైదులు పాల్గొని యోగాసనాలు సాధన చేశారు.



ఆత్మకూరు : యోగాసనాలు వేస్తున్న పోలీసులు, చిన్నారులు

ప్రలోభాలతో మోసపోవద్దు : డీఎస్పీ

సంగం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రలోభాలతో గురై మోసపోవద్దని డీఎస్పీ వేణుగోపాల్ కోరారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు ఎక్కువయ్యాయని, అలాంటివి జరిగితే 1930కాల్ సెంటర్‌కు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ వేమారెడ్డి, ఎస్‌ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ వేణుగోపాల్

సుస్థిరాభివృద్ధికి ప్రణాళికలే కీలకం



ప్రతిజ్ఞ చేయిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు రమేష్

సంగం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సుస్థిరాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలే కీలకమని రాష్ట్ర పరిశీలకుడు రమేష్ పేర్కొన్నారు. గురువారం రెండో రోజు ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి జరుగుతున్న శిక్షణను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పల్లెసీమల సుస్థిరాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. ఏపనికైనా ప్రణాళిక అవసరమన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో నారాయణ, ఎంపీడీవో షాలెట్, ఈవోఆర్డీ ప్రసాద్ పాల్గొన్నారు.

● అనంతసాగరం: 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. గురువారం ఎంపీపీ సంపూర్ణమ్మ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణ ముగిసింది. కార్యక్రమంలో ఏవో మస్తాన్ పాల్గొన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కందుకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే అధిక దిగుబడులు వస్తాయని పొగాకు బోర్డు ప్రొడక్షన్ మేనేజరు కృష్ణశ్రీ తెలిపారు. గురువారం కందుకూరు సీటీఆర్‌ఐలో దక్షిణప్రాంత తేలికనేలలు, నల్లనేలల గురించి రైతులకు ఏర్పాటు చేసిన శిక్షణలో ఆమె పాల్గొన్నారు. సీటీఆర్‌ఐ హెడ్ అనూరాధ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, పొగాకు బోర్డు ఉన్నతాధికా రులు పాల్గొన్నారు. పొగాకు సాగును లాభదాయకంగా చేసుకునేందుకు పాటించాల్సిన పద్ధతు లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధునాతన టెక్నాలజీతో రూపొందించిన ఆకు అల్లే యంత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు విస్తరణ మేనేజరు దామోదర్, మార్కెటింగ్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ మేనేజరు శ్యాం ప్రసాద్, దక్షిణాది తేలికనేలల పరిధిలోని వేలం కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొడక్షన్ మేనేజరు కృష్ణశ్రీ

ముసురుతో ఆందోళన

ఆత్మకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం నుంచి మళ్లీ ముసురు పట్టింది. గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. సాయంత్రం వరకు చల్లని గాలులు వీచాయి. ఈ క్రమంలో శుక్రవారం కూడా మళ్లీ వర్షాలు కురిసే అవకాశాలుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరినారు మళ్లు, మిరప, మినుము, పొగాకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. ముసురుతో మెట్టలో ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు తెగుళ్ల ఉధృతి అధికమై దిడగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కండలేరు కాలువకు పరిష్కారం చూపండి

కందుకూరు, డిసెంబరు 19 (ఆన్‌లైన్): రాళ్లపాడు రిజర్వాయరు కుడికాలువ స్లాప్‌లాక్ షటర్ సమస్యను పరిష్కారించాలని రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడును కందుకూరు మాజీఎమ్మెల్యే దివి శివరాం కోరారు. గురువారం సాయంత్రం ఆయన అమరావతి సచివాలయంలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా సమస్య తీవ్రతను మంత్రికి వివరించారు. రాళ్లపాడు రిజర్వాయరు పరిధిలో 25 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా అందులో 22వేల ఎకరాలు కుడికాలువ కిందే సాగవుతుందని తెలిపారు. పంటలకు సకాలంలో నీరు అందక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు చెప్పా రు. అనంతరం రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కలిసి కందుకూరు మండల కార్యాలయాల ఆవరణలో పెట్రోలు బంకు ఏ ర్పాటు ప్ర తిపాదన అమలు కాకుండా చూడాలని శివరాం విజ్ఞప్తి చేశారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారా యణరెడ్డిలను శివరాం మర్యాదపూర్వకంగా కలిశారు.

చెత్త సేకరణ ట్రాక్టర్ కోసం నిరీక్షణ

కావలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చెత్త తరలింపుకు సరిపడా వాహనాలు లేక ఇంటింటా సేకరించిన చెత్త రోడ్లపైనే దర్శనమిస్తోంది. గతంలో తోపుడు బండ్లతో సేకరించిన చెత్తను ఆ ప్రాంతంలో ఉన్న డంపర్‌బిన్‌లో వేసేవారు. అయితే డంపర్‌బిన్‌లు సకాలంలో తరలించకపోవటంతో దానిలో వేసిన చెత్త రోడ్లమీద పడి అపరిశుభ్రంగా దర్శనం ఇస్తుంది. తోపుడుబండ్లు రోడ్లపై పెట్టి కార్మికులు ట్రాక్టర్ వచ్చే వరకు అక్కడ నిరీక్షించలేక వెళ్లిపోతున్నారు. అందులో పందులు, ఇతర మూగజీవాలు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి చెత్త తరలింపుకు సరిపడా వాహనాలు సిద్ధం చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

● బిట్రగుంట: ఇబ్రహీంపేట మసీదు రోడ్డులో నిల్వ ఉన్న చెత్తను తొలగించాలని గురువారం స్థానిక మహిళలు కోరారు. కొన్నిరోజులుగా వేస్తున్న చెత్త, వ్యర్థపదార్థాలతో దుర్వాసన వస్తుందని వాపోయారు. పేరుకు మేజర్ పంచాయతీయే కాని పల్లెటూరు కన్నా అధ్వానంగా ఉందని చెబుతున్నారు. ఈ సమస్యతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రీసర్వే గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు కష్టాలు అధిగమిస్తాం

● నాగరాజు, వ్యవసాయ సహాయసంచాలకుడు, కావలి

ఇంటర్వ్యూ...



కావలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రీసర్వే గ్రామాలలో ఈ- క్రాప్ నమోదు ఆలస్యమవుతోందని ఈ సమస్యను అధిగమించేందుకు తగు చర్యలు తీసుకుంటామని కావలి వ్యవసాయ సహాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. అలాగే కావలి సబ్ డివిజన్‌లో అత్యధికంగా 32వేల హెక్టార్లలో వరిసాగు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే 80శాతం నాట్లు పూర్తి అయినట్లు చెప్పారు.

? ఎన్ని హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు.

! 32 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. దానిలో 80 శాతం వరకు ఇప్పటికే నాట్లు వేశారు. కొన్నిచోట్ల వరి నాట్లు వేస్తున్నారు.

? ఎదురయ్యే సమస్యలు ఏమిటి

! రీసర్వే జరిగిన గ్రామాలలో ఎల్‌పీ నంబరు వలన ఒక సర్వే నంబరులో ఉన్న మొత్తం విస్తీర్ణంలో పలువురు రైతులు ఉంటారు. ఆ నంబరులో ఉన్న ఒక రైతుకు సంబంధించిన పొలంలో ఈ-క్రాప్ నమోదు చేస్తే అదే నంబరులో మిగతా రైతులకు ఈ-క్రాప్ నమోదుకు సాంకేతిక ఇబ్బందులు వస్తున్నాయి.

? సిబ్బంది కొరత ఉందా.

! సబ్‌డివిజన్‌లో 64 మంది గ్రామ వ్యవసా య సహాయకులు ఉండాల్సి ఉండగా 35మంది మాత్రమే ఉన్నారన్నారు.

? ఈ-క్రాప్ నమోదులో జాప్యం ఎందుకు జరుగుతోంది.

! ఈ-క్రాప్ నమోదుకు తగినంత మంది సిబ్బంది లేరు. అలాగే రీ సర్వే గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదుకు సాంకేతిక సమస్యలు వస్తున్నందున ఆలస్యమవుతోంది. ఈ విష యాన్ని ఉన్నతాధికారులకు తెలిపాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

పాత వంతెన పక్కనే జోరుగా సాగుతున్న కొత్త బ్రిడ్జి పనులు



సీఆర్‌సీలో సేవలు అద్భుతం

● క్రీడా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీఆర్‌సీ (సంయుక్త ప్రాంతీయ కేంద్రం)లో దివ్యాంగులకు అందిస్తున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రశంసించారు. మండలంలోని ఎర్రగుంట సమీపంలో ఉన్న సీఆర్‌సీలో గురువారం దివ్యాంగులకు నిర్వహించిన క్రీడాపోటీలను ముఖ్యఅతిథిగా పాల్గొన్న సోమిరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి ప్రమాణాలతో సేవలందించే సీఆర్‌సీ తన నియోజకవర్గంలో ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఫిజికల్ మెడిసిన్ అండ్ రిహాబిలిటేషన్, క్లినికల్ సైకాలజీ, స్పీచ్ అండ్ ఆడియోలాజికల్ సేవలు, ప్రత్యేక విద్య, ఫిజియోథెరపీ, హైడ్రోథెరపి, ఆక్యుపెషనల్‌థెరపి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ తదితర సేవలు ఉచితంగా అందిస్తున్నడం శుభపరిణామమన్నారు. ఈ సేవల వివరాలన్నింటిని గ్రామస్థాయిలోకి తీసుకెళ్లి అవసరమైన వారు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించే బాధ్యత అందరిపై ఉందన్నారు. క్రీడాపోటీలతో దివ్యాంగుల్లో మానసిక, శారీరక ఉల్లాసాన్ని నింపుతాయన్నారు. పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రత్యేక శ్రద్ధతో అనేక జాతీయస్థాయి సంస్థలు సర్వేపల్లి నియోజకవర్గంలో ఏర్పాటయ్యాయన్నారు. అనంతరం సీఆర్‌సీకి కూతవేటు దూరంలో ఉన్న ఎర్రగుంట శ్మశానాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌సీ డైరెక్టర్ పీ.మనోజ్ కుమార్, జిల్లా అధికారిణి ఉషారాణి, జిందాల్ కంపెనీ ప్రతినిధి మన్సూరి, నాయకులు బొమ్మి సురేంద్ర, కోదండయ్యనాయుడు, రమేష్‌నాయుడు, సతీష్‌నాయుడు, మస్తాన్‌నాయుడు, వల్లూరు వంశీ, వల్లెపు మునుస్వామి తదితరులు పాల్గొన్నారు.



సీఆర్‌సీలో దివ్యాంగుల క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నూతన వంతెన శరవేగంగా...

వెంకటేశ్వరపురంలో ఇళ్ల కూల్చివేత

బాధితులకు అందిన నగదు, త్వరలో స్థలాల పంపిణీ





నేలమట్టమైన ఇళ్లు, శిథిలాలను తొలగిస్తున్న యువకులు

నెల్లూరు నగరంలో పెన్నా నదిపై నూతన వంతెన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నగరాన్ని, వెంకటేశ్వరపురాన్ని అనుసంధానిస్తూ ఇప్పటికే ఒక వంతెన ఉంది. అయితే అది 50 ఏళ్లకు పైబడినదికావడం, ప్రస్తుత వాహన రద్దీకి సరిపోకపోవడంతో పెన్నాపై మరో వంతెన నిర్మిస్తున్నారు. ఈ కట్టడానికి అడ్డంకిగా ఉన్న నివాసాలను కూల్చివేస్తున్నారు. దాదాపు 40 ఏళ్లుగా ఈ ప్రాంతంలో పేదలు నివసిస్తున్నారు. వంతెన కోసం వారందరికీ నష్టపరిహారం చెల్లించి ఇళ్లు ఖాళీ చేయించారు. దీంతో వారంతా బాడుగ ఇళ్లలోకి తరలుతున్నారు. త్వరలోనే వీరికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే వెంకటేశ్వరపురం కూడలిలోని దుకాణ యజమానులకు ఇంకా నష్టపరిహారం అందలేదని తెలిసింది. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ, పరిహారంతో తమకు సంబంధం లేదని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని వంతెన నిర్మాణ కాంట్రాక్టర్ తెలియజేసినట్లు నిరాశ్రయులు వాపోతున్నారు.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం,ఆంధ్రజ్యోతి)

తాళాలు తీసుకున్న వారు ఇళ్లలోకి వెళ్లండి

● వసతులు కల్పిస్తున్నాం : కమిషనర్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణం పూర్తయి తాళాలు తీసుకున్న టిడ్కో గృహ లబ్ధిదారులు వెంటనే వారికి కేటాయించిన ఇళ్లలోకి వెళ్లాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ సూచించారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మాట్లాడుతూ ఇప్పటి వరకు సుమారు 6 వేల మంది లబ్ధిదారులు టిడ్కో గృహాల్లో కాపురాలుంటు న్నారని, మరో 6 వేల మంది తాళాలు తీసుకుని ఇళ్లలోకి వెళ్లలేదని చెప్పారు. వీరంతా ఈ నెలాఖరులోపు ఇళ్లలో చేరాలని కోరారు. టిడ్కో సముదాయాల వద్ద ప్రజలకు అవసరమైన కనీస వసతులు సమకూర్చుతున్నట్లు వెల్లడించారు. పారిశుధ్యం, విద్యుత్, తాగునీరు, రోడ్లు, రవాణా, సెక్యూరిటీ వంటి సౌకర్యాలన్నీ అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు.

న్యూస్ బాక్స్

జాతీయ సమైక్యత శిబిరానికి 8 మంది ఎంపిక

వెంకటాచలం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ జిల్లాలోని లక్ష్మీబాయి యూనివర్శిటీలో ఈనెల 21 నుంచి జరగనున్న జాతీయ సమైక్యత శిబిరానికి వీఎస్‌యూ కళాశాలతోపాటు అనుబంధ కళాశాలలకు చెందిన 8 మంది విద్యార్థులు వలంటీర్లుగా ఎంపిక య్యారు. వారు గురువారం విడవలూరు జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సునీల్ శర్మ సారథ్యంలో బయలుదేరి వెళ్లారు. ఏర్పాట్లను ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీ వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షించారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్ రావు వారిని ప్రత్యే కంగా అభినందించారు.

మెరుగైన 'వైద్య సేవ'లు అందించండి

● జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆ పథకం నెట్‌వర్క్ ఆసుపత్రుల నిర్వాహకులకు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్ సూచించారు. గురువారం నగరంలోని రెయిన్‌బో, రిచ్ ఆసుపత్రులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్థోపెడిక్, చిన్నపిల్లల వార్డులను పరిశీలించి, చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు.. నిబద్ధతతో చికిత్స చేయాలని, నిబంధనలు పక్కాను పాటించాలని హెచ్చరించారు. వైద్య సేవ పథకం జిల్లా మేనేజర్ వెంకటమురళి, టీం లీడర్లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక గోపాలకృష్ణయ్య స్కూలు, తదితర పాఠశాలల్లో గురువారం జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలు ప్రదర్శించారు. హైదరాబాదు విశ్వం ఎడ్యుకేషనల్ సొల్యూషన్ జోనల్ ఇనాచార్జ్ వెంకటేష్ పాల్గొన్నారు.

రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ త్యాగాలు మరువలేనివి

● ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశం కోసం ప్రాణాలర్పించిన రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్ త్యాగాలు మరువలేనివని ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ అన్నారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో పండిత్ రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్ 97వ సంస్మరణ కార్యక్రమం జరిగింది. వారి చిత్రపటాలకు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. షేక్ రషీద్ మాట్లాడుతూ రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ దేశ స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొని హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రేరణగా నిలిచారని, దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి జిల్లా నాయకుడు సూర్యనారాయణ, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు సుబ్రహ్మణ్యం, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, వెంకట రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హర్ష, అవాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళి

కోవూరు,(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం 1927 డిసెంబరు 19న కాకోరి రైలు ఘటనలో అమరులైన రామప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌లకు వారి వర్ధంతి సందర్భంగా గురువారం సీపీఎం నాయకులు ఘన నివాళులర్పించారు. మండబయలు కూడలిలోని సీపీఎం కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి వారి త్యాగాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీ.శేషయ్య, బాబు, బాండ్‌బాషా, సర్దార్ అహమ్మద్, ఫాతిమా, వెంకటరమణయ్య, ఎం.సుబ్బారావు, బుజ్జయ్య, తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాల వేస్తున్న రషీద్ తదితరులు



కోవూరు : బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్‌లకు నివాళులర్పిస్తున్న గండవరపు శేషయ్య, బాబు

డివైడర్లపై ఫ్లెక్సీల నిషేధం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని నెల్లూరు-ముంబై జాతీయ రహదారిలో డివైడర్ల మధ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని నిషేధించామని, ఎవరైనా ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారస్థులు, రాజకీయ పార్టీల నాయకులు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా జరిమానా విధిస్తామని తెలిపారు. డివైడర్లలో పూల మొక్కలు పెంచి అందంగా తయారుగా ఫ్లెక్సీల ఏర్పాటు వల్ల రహదారి అందం దెబ్బతినడంతోపాటు రోడ్డు ప్రమాదాలకు దారి తీస్తుందని పేర్కొన్నారు. దీంతో ఫ్లెక్సీలు నిషేధించామని, నగర ప్రజలందరూ సహకరించాలని తెలిపారు.

వామ్మో.. చలి..!

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అసలే పండుగ నెల.. ఎముకలు కొరికే చలికి వణికిపోతున్న పల్లె జనం చలి మంటలు వేసుకుంటున్నారు. చలి, మంచుతో వేకువ జాము నుంచి ఉదయం 8గంటల వరకు జనం బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. పిల్లలు, వృద్ధులు, చలిమంటలు వేసుకుంటూ ఎండబడే వరకు చలికాసుకుంటూ కాలంగడిపేస్తున్నారు.

చలికి గజగజ..

కోవూరు,(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో గురువారం వాతావరణంలో ఒక్కసారిగా ఏర్పడిన మార్పు వల్ల చలికి ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఓ వైపు తుపాను హెచ్చరికలు మరొక వైపు వీస్తున్న చల్లటి గాలి వల్ల కోవూరులో వృద్ధులు ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులు చలికి వణుకుతూ పాఠశాలలకు వెళ్ళడం ఇబ్బందికరంగా మారింది. గతంలో ఎన్నడూ పండగ నెలలో ఇలాంటి వాతావరణాన్ని చూడలేదని పలువురు వృద్ధులు వాపోయారు. రెండు రోజులు భారీ వర్ష సూచనలిస్తుండటంతో రైతులు, గృహిణులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



జొన్నవాడ ఆలయ సమీపంలో చలిమంట వేసుకున్న గిరిజనులు, చిన్నారులు

రోజంతా చలిగాలులే..

ముత్తుకూరు,(ఆంధ్రజ్యోతి): ఓవైపు మంచు.. మరోవైపు వర్షంతోపాటు రోజంతా చలిగాలులు మండల ప్రజలను వణికించాయి. ముత్తుకూరులో గురువారం 8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఇదే అత్యధికం కావడం విశేషం. చలి అధికంగా ఉండడంతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు కమ్ముకుని, వర్షపు జల్లులు కురుస్తూనే ఉన్నాయి.

రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికే సదస్సులు



మాట్లాడుతున్న డీటీ ప్రదీప్

ముత్తుకూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే గ్రామ సదస్సులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ తహసీల్దారు ప్రదీప్ తెలిపారు. మండలంలోని ఆముదాలపాడులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ వెంకటేష్, వీఆర్వో ప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

సైదాపురం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు, పొక్కుందల గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, ఇతర భూసమస్యలపై రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు రమాదేవి మాట్లాడుతూ భూసమస్యలపై వచ్చిన వినతిపత్రాలను పరిశీలించి, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్మికంపోస్టు విక్రయాలు పెంచండి

మనుబోలు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డుల్లో వర్మికం పోస్టును తయారు చేసి విక్రయించాలని నెల్లూరు డీఎల్‌పీవో డాక్టర్ పుట్టా రమణయ్య అన్నారు. ఆయన మనుబోలు డంపింగ్ యార్డును గురువారం తనిఖీ చేశారు. అక్కడున్న వర్మికంపోస్టును రైతులకు విక్ర యించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్మికంపోస్టు విక్రయించగా వచ్చిన నగదును కార్యదర్శులు పంచాయతీ ఖాతాలకు జమ చేయాలన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను నేరుగా కేంద్రాల వద్దకు చేర్చి వేరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి గరుడయ్య పాల్గొన్నారు.



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణయ్య

ఎరువుల దుకాణాల తనిఖీ

కోవూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు పీ కృష్ణయ్య, ఇందిరావతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విడవలూరు వ్యవసాయాధికారి పీ కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి దుకాణంలో ఎరువుల స్టాకు వివరాలు బోర్డుల్లో పొందుపరచాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం విక్రయించాలన్నారు. ఇనమడుగు, చెర్లోపాళెం, కోవూరుల్లోని దుకాణాల్లో ఎరువుల స్టాకు వివరాలు తనిఖీ చేశారు.



ఎరువులను పరిశీలిస్తున్న ఏవోలు కృష్ణయ్య, ఇందిరావతి





నీళ్లలో వెళ్లలేం.. రోడ్డుపై నడపలేం!!

ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్రాంతం నెల్లూరు - జొన్నవాడ రహదారి పొట్టేపాళెం కలుజు వద్దది. నెల్లూరు చెరువులోనుంచి నీటి ప్రవాహం ఇలా కలుజు నుంచి పెన్నాలోకి పారుతోంది. నీటి ఉధృతి, పాచి కారణంగా పెద్ద వాహనాలు తప్ప స్కూటర్లు, ఆటోలు దీనిపై వెళ్లలేవు. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉండటంతో పక్కనే ప్రత్యామ్నాయ దారిని అధికారులు ఏర్పాటు చేశారు. కానీ ఆ మార్గం గోతులతో నిండి పూర్తిగా ధ్వంసమైంది. స్కూటర్లు వెళ్లాలన్నా కష్టంగా ఉంది. నిత్యం ఈ దారిలో వందల మంది ప్రయాణిస్తుంటారు. అయినా అటు పాలకులుగానీ, ఇటు అధికారులుగానీ పట్టించుకోవడం లేదు. ఈ పరిస్థితుల్లో అటువైపుగా వెళ్లాలంటేనే వాహనదారులు 'అమ్మో!' అంటున్నారు.

- నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

అంధులకు గొడుగుల వితరణ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చంద్రబాబు నగర్‌లో ఉన్న స్వర్ణ దీపం అంధుల ఆశ్రమానికి రోటరీ క్లబ్ సౌత్ వారు గురువారం గొడుగులు వితరణ చేశారు. ఆ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీహరి, కార్యదర్శి మల్లికా బేగం, మాజీ ప్రెసిడెంట్ గోవిందరాజు సుభద్రా దేవి, సభ్యుడు సుధాకర్‌రెడ్డి తదతరులు గొడుగులు, పండ్లు పంచిపెట్టారు. సుమారుగా 40 మంది అంధులు రోజూ భుక్తి కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో సంగీత పరికరాలు వాయిస్తూ, పాటలు పాడుతుంటారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వారి సౌకర్యార్థం పెద్ద గొడుగులు అందజేసినట్లు దాతలు తెలిపారు. ఆశ్రమం నిర్వాహకురాలు ఉమామహేశ్వరి రోటరీ క్లబ్ సౌత్‌కు ధన్యవాదాలు తెలిపారు.

'పెనుగొండ'కు పురస్కారంపై హర్షం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం(అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం దక్కడంపై నగరంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా అరసం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుగు రామకృష్ణ, అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, ఉపాధ్యక్షులు డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, టీవీ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే కరుణశ్రీ, కార్యదర్శి అవ్వారు శ్రీధర్ తదితరులు ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. కాగా, లక్ష్మీనారాయణకు పురస్కారం దక్కడంపై పెన్నా రచయితల సంఘం మరో ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. తెలుగు రచయితకు కేంద్రం అవార్డు దక్కడం సంతోషంగా ఉందని సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రా దేవి, ప్రధాన కార్యదర్శి అవ్వారు శ్రీధర్‌బాబు, మోపూరు పెంచల నరసింహం, తోట సులోచన తదితరులు పేర్కొన్నారు.

రామ్‌చరణ్‌తో జనసేన నగరాధ్యక్షుడి భేటీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు గురువారం హైదరాబాద్‌లోని చిరం జీవి బ్లడ్ బ్యాంకులో సినీ నటుడు రామ్‌చరణ్ తేజను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో విడుదల కానున్న గేమ్‌చేంజర్ చిత్రంతో పాటు రామ్‌చరణ్ తేజ్ నటించే అన్ని చిత్రాలు ఘన విజయం సాధిం చాలని ఆకాంక్షించారు. తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన రామ్‌చరణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.



రామ్‌చరణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుజయ్‌బాబు

పేదలకు వస్త్ర, అన్నదానం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జనసేన నాయకుడు గునుకుల కిషోర్, వీర మహిళలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని జనసేన వీరమహిళల ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ పరిధిలోని రామకోటయ్య నగర్‌లో గురువారం పేదలకు దుస్తులు పంచి అన్నదానం చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను పేదల మధ్య జరుపుకోవడం అభినందనీ యమన్నారు.

చంద్రబాబుతో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్ భేటీ

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, గురువారం మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రాజధానిలో భేటీ అయ్యారు. వక్ఫ్‌బోర్డు నిర్వహణతోపాటు పలు అంశాలపై చర్చించారు. నిర్వహణలో మంచిపేరు తీసుకురావాలని అజీజ్‌కు చంద్రబాబు సూచించారు. అనంతరం మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎండీ ఫరూక్ లతోనూ అజీజ్ భేటీ అయ్యారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424





జనవరి 10 నుంచీ సూళ్లూరుపేట కేంద్రంగా నిర్వహణ

మూడు రోజుల పాటు ఐదు వేదికల మీద కార్యక్రమాలు

ఆంధ్రజ్యోతితో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

మళ్లీ పక్షుల పండుగ కళ

జగన్ ప్రభుత్వం చాపచుట్టేసిన అనేకంలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఒకటి. సూళ్లూరుపేట కేంద్రంగా వైభవంగా జరిగే ఈ పక్షుల పండుగ సంప్రదాయానికి తిలోదకాలు ఇచ్చేశారు. నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ ఈ ప్రాంతానికి పండుగ కళ వస్తోంది. నేలపట్టు చెరువులో గూడబాతుల వయ్యారపు ఈత విన్యాసాలనూ, కర్రపుల్ల ప్రేమ సందేశాలనూ, పిల్ల పిట్టల నోటికి అందించే చేపలనూ.. పులికాట్ సరస్సులో ఫ్లెమింగో కొంగల చేపల వేటనూ, ఆకాశమంతా రెక్కలు విప్పుకుని ఎగిరే రకరకాల వలస పిట్టలనూ వీక్షించేందుకు అనువైన సమయం ఇది. ఈ నేపథ్యంగా నిర్వహిస్తున్న పక్షుల పండుగ విశేషాలను ఆంధ్రజ్యోతితో ప్రత్యేక సంభాషణలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం వివరించారు.

- తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

జనవరి 10 నుంచి..

అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్‌ను రాష్ట్ర పండుగగా నిర్వహించబోతున్నాం. ఈ సంబరాలను రూ.6కోట్లు వ్యయంతో నిర్వహిస్తున్నాం. సూళ్ళూరుపేట కేంద్రంగా జనవరి 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు వేడుకలు జరుగుతాయి.

సీఎంకు, పవన్‌కు ఆహ్వానం

నాలుగేళ్ల తర్వాత జరుగుతున్న ఈ పక్షుల పండుగకు ముఖ్యఅతిథులుగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లతో పాటు, మంత్రులు, జిల్లా ప్రజాప్రతినిధులను ఆహ్వానించాం. స్థానికులను భాగస్వాములను చేసుకుని పండుగ నిర్వహిస్తాం.

పక్షుల వీక్షణకు ఏర్పాట్లు

ఈ సీజన్‌లో 200రకాల పక్షులు 4లక్షల దాకా ఇక్కడికి వస్తుంటాయి. అయితే ఫ్లెమింగో ఫెస్టివల్ నాటికి 18 రకాల పక్షులు 20 వేల దాకా విదేశాల నుంచి వలస వస్తాయి. ఈ పక్షులను వీక్షించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ అనే ప్రఖ్యాత ఎన్జీవో భాగస్వామ్యంతో ఈ ఏర్పాటు చేశాం. శ్రీసిటి ప్రతినిధులను కూడా అనుసంధానం చేస్తున్నాం. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పక్షుల పండుగ జరుగుతుంది. పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.



ఐదు వేదికలుగా పండుగ

ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఐదు వేదికల మీద నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా నేలపట్టులో పక్షుల సందర్శన, స్నేక్‌షో, డాగ్‌షో, వైల్డ్ లెఫ్ ఫోటో ప్రదర్శన ఉంటాయి. షార్ రోడ్డులోని అటకానితిప్పలో పక్షుల సందర్శన, ఫిలింషోలు ఉంటాయి. బీవీపాళెం వద్ద పులికాట్ సరస్సులో బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశాం. ఫ్లెమింగో ఫెస్టివల్ ప్రారంభోత్సవం, ముగింపు కార్యక్రమాలు సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తాం. ఇక్కడ అనేక స్టాల్స్ ఉంటాయి. అందులో చేనేత, కలంకారీ, హస్త కళల సందర్శనతో పాటు తిరుపతి జిల్లా వంటకాలకు సంబంధించి పర్యాటకులకు ప్రత్యేక ఫుడ్‌స్టాళ్లను ఏర్పాటు చేస్తాం.ఈ ప్రాంగణంలో ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి కళాప్రదర్శన నిర్వహిస్తున్నాం. ఐదవ వేదికగా శ్రీసిటీని ఎంపిక చేశాం. పర్యావరణ పరిరక్షణ- పారిశ్రామికవేత్తల సామాజిక బాధ్యతగా ఏకోటూరిజంపై సదస్సులు నిర్వహిస్తున్నాం.

గంటలోనే దర్శనం



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో ఇంటర్వ్యూ...

- తిరుమల ప్రక్షాళన మొదలైంది.
- ఆ చెత్త కాంట్రాక్టు రద్దు చేస్తాం
- భక్తులతో బూతులు మాట్లాడితే ఊరుకోం
- అన్యమత ఉద్యోగులను జమ్మూకి పంపుతాం

'గంటలకు గంటలు క్యూలైన్లలో నిలబడి ఉండాల్సిన అవసరం లేదు. ముఖ ఆధారిత గుర్తింపు వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తే కేవలం గంటలోనే భక్తులకు శ్రీవారి దర్శనం సాధ్యమవుతుంది. ఈ సాంకేతికతను ఉచితంగా అందివ్వడానికి సంస్థలు ముందుకు వస్తున్నాయి. రెండు మూడు నెలల్లోనే ఇది అమలవుతుంది'

నెలన్నరపాటు నిశిత పరిశీలన తర్వాత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ధీమాగా చెప్పిన మాట ఇది. జగన్ జమానాలో అవినీతి చర్యలు, అర్థంపర్థం లేని వ్యయాలు, దర్శనాల దందాలు, అనాలోచిత నిర్ణయాలు.. తిరుమల కొండను కొల్లగొట్టే దిశగా సాగాయనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో పెనుమూరు బిడ్డ బీఆర్ నాయుడు టీటీడీ బాధ్యతలు స్వీకరించారు. చంద్రబాబు ఆకాంక్షకు అనుగుణంగా తిరుమల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. కొత్త చైర్మన్‌గా ఆయన పరిశీలనలు.. చేయాలనుకుంటున్న మార్పుల గురించి ఆంధ్రజ్యోతితో సంభాషణలో వెల్లడించారు.

- ఆ విశేషాలు.. 6లో -



కందిపప్పో..!

- వచ్చిందే తక్కువ.. అదీ అయిపోయింది
- కార్డుదారులకు పలువురు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సమాధానమిది

రేషన్ దుకాణాలు: 1457
బియ్యం కార్డులు: 6,00,350
కిలో లెక్కన కావాల్సింది: 600.35 టన్నులు
కేటాయించింది: 350 టన్నులు

ఈ లెక్కన దాదాపు 62 శాతం మందికే కందిపప్పు వచ్చినట్లు. ఈ తేడాను కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. 'కొంచెమే వచ్చింది. కోటా అయిపోయింది' అని చెబుతున్నారన్న విమర్శలున్నాయి. ఇలా ఎందుకు జరుగుతోందో చూస్తే..

జిల్లాలో రేషన్ షాపులకు చేరిన కోటా మేరకు కందిపప్పును కార్డుదారులకు సక్రమంగా ఇవ్వడంలేదన్న ఆరోపణలున్నాయి. 600 టన్నులు అవసరం కాగా.. 350 టన్నులే వచ్చిందంటూ కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు చేతివాటం చూపుతున్నారన్న విమర్శలున్నాయి. ఎందుకంటే.. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.190 నుంచి 220 వరకు పలుకుతోంది. ఇందులో రకాలను బట్టి ధరలున్నాయి. అదే ప్రభుత్వం రాయితీపై కిలో రూ.67కే రేష్ షాపుల ద్వారా పంపిణీ చేస్తోంది. దీంతో కొందరు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కలిసి తమకు వచ్చిన కోటాలో సగం మాత్రమే కార్డుదారులకు ఇచ్చి.. ఆ తర్వాత అయిపోయిందని చెబుతున్నట్లు తెలిసింది. బియ్యం ఇస్తున్న సమయంలోనే కందిపప్పు, చక్కెర ఇస్తున్నట్లు కూడా వేలిముద్రలు వేయించుకుంటున్నారు. దీంతో అసలు కందిపప్పు ఎంత ఇచ్చారనేది తెలియని పరిస్థితి. కాగా, పలువురు కార్డుదారులకు ఇవ్వకుండా ఆన్‌లైన్‌లో ఇచ్చినట్లు చూపే కందిపప్పును.. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.140 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

రశీదులిస్తే కొంత పరిష్కారం

నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే సమయంలో ఈ పోస్ మిషన్‌లో కార్డుదారుల బయోమెట్రిక్ తీసుకోవాలి. ఏయే సరుకులు తీసుకున్నారో తెలిసేలా రశీదులివ్వాలి. కానీ ఎక్కడా ఇచ్చిన దాఖలాల్లేవు. ఒకవేళ కార్డుదారుడు కందిపప్పు, చక్కెర వద్దనుకుంటే సదరు డీలరు, ఎండీయూ ఆపరేటర్ మిగిలిన మొత్తాన్ని వచ్చే నెలకు సర్దుబాటు చేయాలి. ఇలా ఎక్కడా జరుగుతున్న ఆనవాళ్లు లేవు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

విచారించి చర్యలు తీసుకుంటాం

జిల్లాలో కోస్టల్ ప్రాంతాల్లో చాలా చోట్ల కందిపప్పు తీసుకోవడం లేదు. దీంతో డీలర్లు వారి దుకాణాలకు ఎంత అవసరమో అంతే డీడీలు కట్టారు. వారి డిమాండు మేరకు సరపరా చేశారు. కార్డుదారులకు కచ్చితంగా కిలో కందిపప్పు, కిలో చక్కెర ఇవ్వాలి. ఇందులో ఎలాంటి దాపరికం లేదు. ఎక్కడైనా ఇవ్వకుంటే వెంటనే మాకు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం. ఎక్కడెక్కడ పంపిణీ చేయలేదో విచారించి స్టాకు, అమ్మకం రిజిస్టర్లు పరిశీలిస్తాం.

- డీఎస్‌వో శేషాచలం రాజు

ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాల కొనసాగింపు

- జిల్లాలో 199 మసీదుల ప్రతినిధులకు లబ్ధి

తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదాయం లేని మసీదుల ఇమామ్‌లకు, మౌజన్లకు చెల్లించే గౌరవ వేతనాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ.. దేశంలోనే తొలిసారిగా ఈ గౌరవ వేతనం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వం ఈ ఏడాది మార్చి వరకే ఈ పథకాన్ని అమలు చేసింది. ఆ తర్వాత బడ్జెట్ కేటాయించలేదు. తాజాగా దీనిపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం ఇమామ్‌లకు నెలకు రూ. 10 వేలు, మౌజన్లకు నెలకు రూ. 5 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కూడా వర్తింపజేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొనసాగింపు ఏప్రిల్ నుంచీ వర్తిస్తుందని పేర్కొంది. జిల్లాలో ఆదాయం లేని మసీదులు 199 ఉండగా.. వాటి ఇమామ్‌లు, మౌజన్లకు నెలకు రూ.29.85 లక్షల చొప్పున గౌరవ వేతనం అందనుంది. పెండింగులోని తొమ్మిది నెలల కాలానికి గానూ మొత్తం రూ.2.68 కోట్లు త్వరలో విడుదల కానున్నాయి.

వేరుశనగ, మామిడి పంట బీమా గడువు పెంపు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈఏడాది రబీలో మామిడి, వేరుశనగ పంటలకు బీమా చెల్లింపు గడువు పెంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈనెల 15 వరకు గడువు ఉండేది. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.30వేలు బీమా కాగా రైతులు రూ.450 ప్రీమియం చెల్లించాలన్నారు. ఎకరా మామిడికి బీమా రూ.35వేలు కాగా రైతులు రూ.1,750 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు.. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, కౌలు రైతులైతే సీసీఆర్‌సీ పత్రం, రైతు సేవా కేంద్రం జారీ చేసే ధ్రువీకరణ పత్రం, రైతు డిక్లరేషన్, మొబైల్ నెంబరు, రైతు బ్యాంకు ఖాతా మొదటి పేజీ కాపీలను సమీపంలోని సీఎస్‌సీ సెంటర్‌కు తీసుకువెళ్తే వివరాలను నమోదు చేస్తారన్నారు. లేకుంటే నేరుగా ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు.



కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్న బాధితులు

పిచ్చికుక్క వీరంగం

పుత్తూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో పిచ్చికుక్క దాడిలో పలువురు గాయపడ్డారు. గురువారం అంబేద్కర్ కూడలిలో ఓ పిచ్చికుక్క హఠాత్తుగా పాదచారులపై దాడికి దిగింది. దాదాపు పది మంది గాయపడ్డారు. దారిన వెళ్లే వారందరిపై దాడి చేస్తూ సాగింది. మామిడికాయల మండీ వద్ద స్థానికులు దాన్ని కొట్టి చంపేశారు. కాగా పిచ్చికుక్క బాధితులు కొందరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. యాంటీ రేబిస్ మందులు ఉండడంతో కుక్క కాటుకు గురైన వారికి ఆస్పత్రిలో చికిత్సలు అందజేశారు. కాగా పట్టణంలో కుక్కలతో పాటు పాముల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవలే ప్రైవేటు విద్యా సంస్థలు ఉన్న ప్రాంతంలో ఓ విద్యార్థి తల్లి పాముకాటుకు గురై మరణించింది. మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కలతో పాటు పాముల బెడదను తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జుల పదవీకాలం పొడిగింపు

తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింగిల్ విండోల పర్సన్ ఇన్‌చార్జుల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే కొనసాగుతున్న అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జుల పదవీ కాలం ఈనెల 20వ తేదీతో ముగియనుంది. దీంతో 21వ తేదీ నుంచీ ఆరు నెలల పాటు వారి పదవీకాలాన్ని పొగిడించింది.

ఈ గుంతలేంటి గోవిందా..!



హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై కనిపిస్తున్న భారీ గుంతలు

నిత్యం పరిశుభ్రంగా, పటిష్టంగా కనిపించే తిరుమల ఘాట్ రోడ్లు ఇప్పుడు గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మొదటి, రెండవ ఘాట్లతో పాటు తిరుమలలోని రోడ్లపై కూడా గుంతలేర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర అగచాట్లు పడుతున్నారు. చిన్నపాటి మరమ్మతులు చేపడుతున్నా నాణ్యత లేకపోవడంతో చిన్న గుంతలు కూడా పెద్దవిగా మారిపోతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేలకోట్ల రూపాయల బడ్జెట్ కలిగిన టీటీడీలో రోడ్ల నిర్వహణ దారుణంగా ఉందంటనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టిసారించాల్సిన అవసరముంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రెండవ ఘాట్ చివరి మలుపు వద్ద రోడ్డు దుస్థితి



మొదటి ఘాట్‌లో మరమ్మతులు చేసినా గుంత పక్కనే మరో రెండు గుంతలు

నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శుక్రవారం నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. శుక్రవారం, ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఉదయం 8.30నుంచి 9.15 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి 2.15 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను లోనికి అనుమతిస్తామని తెలిపారు. తిరుపతి జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్, రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల, కోట మండలంలో ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్న ఈ పరీక్షకు 671మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం కూడా రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. గురువారం 47 గ్రామసభలు నిర్వహించగా.. 686 అర్జీలు వచ్చాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తొట్టంబేడు మండలం విరుపాక్షిపురంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ హాజరయ్యారు.

■ నా హీరో చంద్రబాబు



- లోకేశ్ నన్ను హిట్లర్ అంటాడు
- ఒకవైపే చూడు.. బాలయ్య డైలాగుతో ఆకట్టుకున్న నారా భువనేశ్వరి

- 6లో

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకించండి

జేఏసీ నాయకుల పిలుపు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించాలని విద్యుత్ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట గురువారం విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఎల్.చలపతి, వి.గోపి, ఆర్.మురళీధర్, నాగరాజు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయన్నారు. కార్పొరేషన్లుగా విడగొట్టి కార్పొరేటర్లకు అప్పగించడానికి ప్రయత్నిస్తోందన్నారు. విద్యుత్ సంస్థలు ప్రైవేట్ పరమైతే ప్రజలకు రాయితీలు ఉండవన్నారు. పాలకుల కుతంత్రాలను ఉద్యోగులు, ప్రజలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ప్రసాద్ రెడ్డి, వంశీ, గోపి, అభినయ్, కార్తీక్, బ్రహ్మానందరెడ్డి, గుణశేఖర్, శివప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యుత్ సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నీకి ఎస్వీయూ ఫుట్‌బాల్ జట్టు



తిరుపతి(క్రీడలు), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీకి ఎస్వీయూ ఫుట్‌బాల్ పురుషుల జట్టు ఎంపికైనట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్ రెడ్డి తెలిపారు. శనివారం కేరళలోని కాలికట్‌లో జరిగే పోటీలలో పాల్గొనేందుకు 20మందితో కూడిన జట్టు గురువారం పయనమైంది. ఎస్.సుదర్శన్‌రెడ్డి కోచ్‌గా, డాక్టర్ ఎస్.గఫూర్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్వీయూ మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు డాక్టర్ ఎం.ఎస్.నజరుద్దీన్ పాల్గొని క్రీడాకారులకు దుస్తులు, సామగ్రి పంపిణీ చేశారు.

జట్టులో స్థానం దక్కినవారి వివరాలిలా..

ఆర్.డేనియల్(ఎస్వీపీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ శ్రీకాళహస్తి), కె.మహమ్మద్‌అన్సారీ(శేషాచల డిగ్రీ కాలేజీ పుత్తూరు), బీ.ఉదయ్‌కిరణ్‌రెడ్డి(వింగ్ బిజినెస్ స్కూల్ తిరుపతి), ఆర్.ఒనీష్‌రెడ్డి(సీకాం డిగ్రీ కాలేజీ తిరుపతి), ఎస్.మహమ్మద్‌బాషా(మదర్‌థెరీసా ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ పలమనేరు), ఎ.దిలీప్, టి.ఉదయ్‌కిరణ్, కె.శ్రీనివాసులు(గవర్నమెంట్ డిగ్రీకాలేజీ పుత్తూరు), ఎం.నరసింహులు, డి.చంద్రశేఖర్, వి.హరీష్, ఎం.మహేష్, వి.రేవంత్‌బాబు(ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ, తిరుపతి), సి.అశోక్, జి.ధనుష్‌వంశి(గేట్ డిగ్రీ కాలేజీ తిరుపతి), ఎస్.విజయ్, ఆర్.హెచ్.ప్రశాంత్(సిద్ధార్థ కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తిరుపతి), బి.వెంకటబాలాజీ(ఎస్వీయూ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్), ఎస్.మహమ్మద్‌ఉజైర్(శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ మదనపల్లి), ఆర్.శిబిరాజ్(గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ నగరి).

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. లక్షదీప్ గవర్నర్ ప్రఫుల్ ఖోడా పటేల్, తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్‌యాదవ్, మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు, మాజీ జేఈవో శ్రీనివాసరాజు, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భుషణ్ ప్రసాద్ సింగ్, హిమాచల్‌ప్రదేశ్ లోకాయుక్తా జస్టిస్ సీబీ బరావలియా ఉన్నారు.





ప్రఫుల్ ఖోడా పటేల్ - జస్టిస్ భుషణ్ ప్రసాద్ సింగ్



తలసాని శ్రీనివాసయాదవ్, పుట్టా సుధాకర్‌యాదవ్



సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్ట్‌మెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.16 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 70,457

తలనీలాలు సమర్పించినవారు : 22,152



గంటలోపే దర్శనం

చైర్మన్ అనే హోదాను అనుభవించడానికి నేనీ బాధ్యత స్వీకరించలేదు. స్వామి కొలువు గొప్పవరం. తిరుమలకు వచ్చే వెళ్లే ప్రయాణం, బస, భోజనం వంటి ఖర్చులు ఏవీ టీటీడీ మీద భారం మోపడం లేదు. సొంతంగా నేనే పెట్టుకుంటున్నా. దర్శనాల కోసం చైర్మన్ మీద ఎంత ఒత్తిడి ఉంటుందో అందరికీ తెలుసు. అయినా.. దర్శన టికెట్ల కోటాను కూడా నేను వినియోగించుకోవడం లేదు.

టీటీడీకి వచ్చే ఆదాయానికంటే, చేసే ఖర్చే అధికంగా ఉంటోంది. మళ్లీ కుబేరుడివంటి వారిని వెతుక్కుని అప్పు చేయాలి. అలా చేసి పెట్టారు టీటీడీని. వ్యక్తిగత పనులన్నీ వదిలేసి తిరుమలలోనే ఉంటూ అన్నింటిపై దృష్టి సారించా. స్వామికి చెందిన ఒక్క రూపాయి కూడా వృథా కానివ్వను.

తిరుమల ప్రక్షాళన మొదలైంది

ఆక్రమించిన మఠాల జోలికే వెళ్తాం!

తిరుమలలో 30 దుకాణాలు తిరిగితే కనీసం శ్రీవేంకటేశ్వరస్వామి ఉండే ఉంగరాలు దొరకవు కానీ, శిలువ బొమ్మలుండే కడియాలు ఉంటున్నాయి. దుకాణాల వ్యవహార తీరును కూడా మార్చాలి.

అన్నేసి గంటలు క్యూలో ఉండడం మానవహక్కుల ఉల్లంఘనే

INTERVIEW

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

ఆయన వెంట మందీ మార్బలం కనిపించదు. ఆర్భాటం అసలు ఉండదు. హడావుడి లేదు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆయన శైలి విలక్షణం. ఒక సాధారణ భక్తుడిలా తిరుమల అంతా కలియతిరుగుతుంటారు. భక్తులతో మాట్లాడతారు. దుకాణాలను పరిశీలిస్తారు. ఒక రీసెర్చర్‌లా వివరాలు తెలుసుకుంటారు. ఆ తర్వాత అధికారులతో మాట్లాడతారు. గుర్తించిన లోపాలు వివరించి సరిదిద్దుకునే అవకాశాలేమిటని ఆరా తీస్తారు. సీఎం చంద్రబాబు ఆకాంక్షను నెరవేర్చే దిశగా తిరుమల ప్రక్షాళనకు పూనుకున్నారు టీటీడీ కొత్త చైర్మన్ బీఆర్ నాయుడు. పెనుమూరు మండలం దిగువపునేపల్లిలో పుట్టిపెరిగిన ఈయన తొలుత బీహెచ్ఈఎల్‌లో ఉద్యోగం చేశారు. ఆ తర్వాత వ్యాపార వేత్తగా స్థిరపడ్డారు. నవంబరు 6న టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడు గత చైర్మన్లకు భిన్నంగా తన ఖర్చులన్నీ తనే పెట్టుకుంటూ తిరుమలలో ఉంటున్నారు. తిరుమలలో భక్తుల కష్టసుఖాలు తెలుసుకుంటూ, టీటీడీ అనుపానులు గ్రహిస్తూ ఆచితూచి అడుగేస్తున్న బీఆర్ నాయుడితో ఆంధ్రజ్యోతి సంభాషణలోని ముఖ్యాంశాలు...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

? చైర్మన్ కావాలని ఎప్పుడు అనిపించింది. ఎందుకు.

! దాదాపు పదిహేనేళ్ల కిందటే టీటీడీ ధర్మకర్తల మండలికి చైర్మన్ కావాలని కోరుకున్నా. చిత్తూరు జిల్లాలో పుట్టిపెరిగినవాడిగా ఇక్కడుండే సమస్యలన్నీ నాకు తెలుసు. నేను చైర్మన్ అయితే మార్పులు చేయగలనని చిన్న ఆశ. స్వామి ఇచ్చిన ఈ అవకాశాన్ని గొప్పవరంగా భావిస్తున్నా. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ తిరుమలకు వస్తూనే ఉన్నాను. శ్రీవేంకటేశ్వర స్వామి మీద అచంచల భక్తి చిన్నప్పటి నుంచే ఉంది.

? గతంలో దర్శనానికి ఎప్పుడైనా ఇబ్బంది పడ్డారా.

! 10 గంటలకుపైనే క్యూలైన్‌లో వేచి ఉండి స్వామిని దర్శించుకున్న సందర్భాలున్నాయి. ఒక్కోసారి క్యూలైన్‌లో వెళ్లే సమయం లేక పుష్కరిణిలో కాళ్లు కడుక్కొని, తలపై చల్లుకుని, కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోయేవాడిని. గొల్లమండం నుంచే స్వామికి నమస్కరించుకుని ఈసారికి ఇదే భాగ్యం అనుకునేవాడిని. గతంలో గవర్నమెంట్ సర్వీస్‌లో ఉండేవాడిని. సెలవులు తక్కువ. టైం ఉండదు కాబట్టి అన్నేసి గంటలు క్యూలో ఉండే వీలుండేది కాదు.

? చైర్మన్‌గా తిరుమలలో మీరు గుర్తించిన లోపాలేంటి.

! ప్రధానంగా స్వామి దర్శనానికి వచ్చే వారిని 20 నుంచి 30 గంటల పాటు కంపార్టుమెంట్లలో కూర్చోబెట్టి తాళాలు వేసేస్తున్నారు. లోపలికి రానివ్వరు, బయటకు పోనివ్వరు. నా దృష్టిలో అది కరెక్ట్ కాదు. మానవ హక్కుల ఉల్లంఘన అవుతుందని గతంలో కూడా చెప్పాను. భక్తులు చాలా ఇబ్బందులు పడటాన్ని స్వయంగా చూశా. ఐదు కిలోమీటర్ల పొడవుతో ఉన్న క్యూలైన్లలో భక్తులు గంటల తరబడి నిలుచుంటున్నారు. వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఇబ్బంది పడుతున్నారు. అంతదూరం నడిపించాల్సిన అవసరం ఏమిటి? అలాగే వ్యర్థాల తొలగింపు సరిగా జరగడం లేదు. కుప్పలుకుప్పలుగా చెత్త పేర్కుపోయింది. చెత్త తొలగింపునకు ఒక సంస్థకు రూ.20 కోట్లకు కాంట్రాక్ట్ ఇచ్చారు. వారి నిర్వహణ సరిగా లేదు. డబ్బులు ఇచ్చిమరీ చెత్తను తీసుకెళ్లేవారు ఉంటే, వాళ్లను వదిలేసి మనమే డబ్బు ఇచ్చి చెత్త తీసుకువెళ్లండి అనడం ఏమిటో! ఆసంస్థను మార్చాలనుకుంటున్నాం. ఇక, స్విమ్స్ ఆస్పత్రికి ఏడాదికి రూ.వంద కోట్లు టీటీడీ ఇస్తోంది. ఈ అంశంపై తగిన సూచనల కోసం మాజీ ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ఓ కమిటీని వేశాం. స్విమ్స్ నిర్వహణే సక్రమంగా లేదనుకుంటే, కమీషన్ల కోసం కక్కుర్తిపడి గతంలో పిల్లల ఆస్పత్రి, క్యాన్సర్, హార్ట్ ఆస్పత్రి అని పెట్టారు. ఇవన్నీ అవసరమా?. రూ.వెయ్యి కోట్ల నుంచి రూ.1,200 కోట్లు పెట్టి భవనాలు కడుతున్నారు. కట్టి ఏం చేస్తారు. టీటీడీ పని అదేనా? ఆలయాలు లేని చోట కట్టించాలి. నైవేద్యం లేని చోట ఏర్పాట్లు చేయాలి. భజనలు, హిందు ధర్మప్రచార కార్యక్రమాలు చేయాలి. దాని కోసం కదా టీటీడీ ఖర్చు చేయాల్సింది.

? ఆభరణాలు, బంగారు నిల్వలు భద్రంగానే ఉన్నాయా.

! అన్ని సేఫ్‌గానే ఉన్నాయి. ఎలాంటి సందేహాలు అవసరం లేదు.

? ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ ఎందుకు.

! ఉద్యోగుల్లో కొంతమంది భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తున్నారు. కొందరైతే బూతులు మాట్లాడుతున్నారు. వాదవివాదాల్లో భక్తులపైకి కొట్టేందుకు కూడా కొందరు వెళ్లిపోతున్నారు. అటువంటి వాళ్లను భక్తులు ఎలా గుర్తుపట్టాలి?. అందుకే నేమ్ బ్యాడ్జీ ఉంటే భక్తులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా ఉంటుంది. ఆ తర్వాత విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. దీనిపై బోర్డులో చర్చించి త్వరలోనే అమలుచేస్తాం.

? ఎలాంటి మార్పులు చేయాలనుకుంటున్నారు.

! ఎయిర్‌పోర్టులో డిజి యాత్ర విధానాన్ని అందరూ చూసే ఉంటారు కదా. అదే తరహాలో ఏఐ సహకారంతో తిరుమల శ్రీవారి దర్శనాన్ని కూడా గంట వ్యవధిలోనే చేయించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. భక్తుడు తిరుపతికి రాగానే ఆధార్‌కార్డును లింక్ చేసి ఫేస్‌రికగ్నిషన్‌తో టోకెన్ జారీ చేస్తాం. అందులో టైం వచ్చేస్తుంది. ఆ సమయానికి క్యూకాంప్లెక్స్ వద్దకు వస్తే నేరుగా లోపలికి వెళ్లిపోవచ్చు. వేరేవేరు ప్రాంతాల్లో కావాల్సినన్ని కౌంటర్లు ఏర్పాటు చేస్తే తోపులాటలు కూడా ఉండవు. ఇప్పటికే ఇతర దేశాలకు చెందిన ఐదారు సంస్థలు ఈ వ్యవస్థ ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చాయి.. ఉచితంగా చేస్తామంటున్నారు. త్వరలో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తాం. సత్ఫలితాలు వస్తే రెండు మూడు నెలల్లోనే అమలుచేస్తాం. ఏఐ అందుబాటులోకి వస్తే వసతికి ఇబ్బందులు కూడా ఉండవు.

? టీటీడీలో అన్యమత ఉద్యోగుల తొలగింపు సాధ్యమేనా.

! వంద శాతం సాధ్యమే. మనం వాళ్ల పొట్టపై కొట్టడం లేదు. ప్రత్యామ్నాయాలు ఉన్నాయి కదా. ముందు మంచి బెనిఫిట్స్‌తో వీఆర్ఎస్ ఇస్తాం. లేకుంటే ప్రభుత్వానికి డిప్యూటేషన్‌పై సరెండర్ చేస్తాం. వాళ్లు కూడా వద్దంటే వేరే ఆలయాలు ఉన్నాయి కదా. జమ్ము, ముంబై, కన్యాకుమారి వంటి వాటికి మారుస్తాం. పేరేమో వెంకటేశ్వరరావు అని ఉంటుంది. కానీ తిరుపతిలో చర్చిలు నిర్వహిస్తూ ఉంటారు. ఇంట్లోనే చర్చి ఉంటుంది. ఏం చేయాలి వాళ్లని? భక్తన్నా ఉండాలి.. లేదా భయమైనా ఉండాలి. వాళ్లకి ఆ రెండూ లేవు.

? టీటీడీ డిపాజిట మళ్లింపు ప్రక్రియ ఏదశలో ఉంది.

! దాదాపు రూ. 4,800 కోట్లు ప్రైవేట్ బ్యాంకుల్లో ఉన్నాయి. ప్రస్తుతం వాటి జోలికి వెళ్లం. కాలపరిమితి పూర్తవగానే భద్రత కోసం జాతీయ బ్యాంకులకు మళ్లిస్తాం. ఇక కొత్త డిపాజిట్‌లు అన్నీ మాత్రం జాతీయ బ్యాంకుల్లోనే వేస్తాం.

? తిరుమలలో మఠాల నిర్వహణపై మీ స్టాండ్ ఏమిటి.

! అదో తేనె పుట్ట. ఎన్నో ఏళ్ల నుంచా ఉన్న వాళ్లను ఎలా ఇబ్బంది పెడతాం. మఠాధిపతులు, పీఠాధిపతులు అందరు ఉన్నారు ఇక్కడ. కొన్ని మఠాలు వ్యాపార కేంద్రాలుగా మారిపోతున్నాయనే విమర్శలు వస్తునే ఉన్నాయి. టీటీడీ కేటాయించిన స్థలాల్లో కాకుండా అదనపు స్థలాలను ఆక్రమించుకుంటే మాత్రం.. వాటిపై చర్యలు తీసుకుంటున్నాం.

? టీటీడీలో ప్రక్షాళన చేస్తామని సీఎం అన్నారు. ఆదిశగా ఏం చేస్తున్నారు

! గతంలో జరిగిన కొన్ని అక్రమాలపై ఇప్పటికే ప్రభుత్వం స్టేట్ విజిలెన్స్‌తో విచారణ చేయిస్తోంది. నెయ్యి కల్తీ వ్యవహారంపై కూడా సిట్ వేగంగా దర్యాప్తు చేస్తోంది. దానిపై ఇప్పట్లో ఏం మాట్లాడలేం. రిపోర్టులు వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు రూపొందించుకుంటాం. గతంలో సివిల్ వర్క్స్ విపరీతంగా చేశారు. స్వామి డబ్బులంతా సివిల్ వర్క్స్ కోసం వెళ్లిపోతున్నాయి. ముందు ఆపనుల్ని ఆపేయాలి. ఉన్న భవనాలను కూల్చేసి కొత్తవి కట్టడం అవసరమా? టీటీడీకి వచ్చే ఆదాయంలో ఒక శాతం తిరుపతి మున్సిపాలటీకి ఇవ్వాలంట. ఎందుకు ఇవ్వాలి? ఇవన్నీ రానున్న బోర్డులో చర్చిస్తాం. దేవుడు సొమ్ము ఇలా దుర్వినియోగం అయితే ఎలా? వందల మైళ్ల నుంచి వచ్చి స్వామిని దర్శించుకుని వందో రెండొందలో హుండీలో వేస్తారు భక్తులు. కమీషన్ల కోసం వారి భక్తిని ఇలా దుబారా చేస్తే ఎలా. అందుకే తిరుమల నుంచి ప్రక్షాళన చేస్తామని సీఎంగారు చెప్పారు.

? టూరిజం టికెట్ల కోటా రద్దు వెనుక కారణం.

! రూ.300 టూరిజం టికెట్‌ను అధిక ధరకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. నేనే స్వయంగా రూ.3,300 పెట్టి కొనుగోలు చేశాను. విజిలెన్స్ వాళ్లకు చెప్పాను. వాళ్లు కూడా రూ.300 టికెట్‌ను రూ.3,300 కొన్నారు. దీంతో టూరిజం కోటానే రద్దు చేశాం. తిరుమలలోని కొన్ని దుకాణాల్లోనూ దర్శన టికెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నట్టు తెలిసింది. దానిపై కూడా నిఘా పెట్టాం.

సరదా సరదాగా..!

విద్యార్థులతో మమేకమైన నారా భువనేశ్వరి



కాలేజీ రోజులను గుర్తు చేసుకున్నారు. నాటి సరదాలే కాదు.. చిన్న వయసులోనే పెళ్లయిన అమాయకత్వాన్ని, ఏమీ తెలియనితనం నుంచి భర్త చంద్రబాబు దన్నుతో హెరిటేజ్ సారథిగా సాధించిన విజయాలను తలపోశారు. అన్న బాలకృష్ణ డైలాగ్‌ను వల్లించారు. కుమారుడు లోకేశ్ బాల్యాన్ని, పెద్దయ్యాక ఆయనకు చేసిన ఉద్బోధను ఏకరువు పెట్టారు. మొత్తంమీద నారా భువనేశ్వరి చిత్తూరు జిల్లా కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మమేకమై వారిలో ఒకరిగా మారిపోయారు. విద్యార్థులతో ముఖాముఖి సందర్భంగా ఇచ్చిన సమాధానాలలో కాసేపు సరదాగా, కాసేపు సీరియస్‌గా, ఇంకాసేపు గంభీరంగా ఆమె చాలా అంశాలు ప్రస్తావించారు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

- మిమ్మల్ని చూస్తుంటే నాకు నా కాలేజ్ డేస్ గుర్తుకొస్తున్నాయి. నేనూ మీలాగే సరదాగా ఉండేదాన్ని. కానీ చదువుకుంటుండగానే నాకు చంద్రబాబుతో పెళ్లయిపోయింది. ఆ వయసులో నాకు ఏమీ తెలియదు. అయినా నామీద నమ్మకంతో నా భర్త చంద్రబాబు హెరిటేజ్ ఎండీని చేశారు. ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేశా. ఇప్పుడీ స్థితికి చేరుకున్నా. ఎవరైనా సరే, కష్టపడనిదే విజయం ఊరికే రాదు.
- నా హీరో చంద్రబాబు. ఆయన విజనరీ నాకు ఆదర్శం. భార్యాభర్తల్లో ఎవరైనా ఎదగాలంటే ఎవరో ఒకరు త్యాగం చేయాలి తప్పనిసరిగా. ఆయన నాకిచ్చే సమయం ఉదయం 8.30 గంటలకు. తర్వాత ఆయన తన బాధ్యతల్లో మునిగిపోతారు. ఏదైనా అవసరమై ఫోన్ చేయాలన్నా, పీఏకి చేయాల్సిందే. ఆయన ఫోన్ ఎత్తరు.
- నేను లోకేశ్ విషయంలో చాలా స్ట్రిక్ట్. నన్ను హిట్లర్ అని పిలిచేవాడు. తన స్నేహితులకు కూడా అలాగే చెప్పేవాడు. చంద్రబాబు రాష్ట్రంకోసం, ప్రజలకోసం పనిచేస్తుంటే సింగిల్ మదర్‌గా పెంచానేమో, లోకేశ్‌ను చాలా క్రమశిక్షణలో పెట్టేదాన్ని.
- నాడు, నేడు రాజకీయాల్లో ఒక తేడా ప్రధానంగా కనిపిస్తోంది. ఒకప్పుడు లీడర్‌కు అనుచరులు పూర్తి విశ్వాసంగా ఉండేవారు . నేడు ఆ విశ్వాసం, బాధ్యత తగ్గిందనిపిస్తోంది. లోకేశ్ బాబు ప్రజలకు న్యాయం చేస్తాడు. నేను హామీ ఇస్తున్నా.
- నేను సినిమాలు చాలా తక్కువ చూస్తా. బాలయ్య మూవీలో ఏది నచ్చిందంటే చెప్పలేను. చూసినంతలో సమరసింహారెడ్డి నచ్చిందని చెప్పవచ్చు. డైలాగ్స్ నాకు రావు. అయినా వచ్చినంత చెబుతాను. ఒకేవైపు చూడు, మరోవైపు చూడబాక అనే డైలాగ్. ఏ విషయంలోనైనా ఫోకస్డ్‌గా ఉండాలి. అప్పుడు విజయం వరిస్తుంది. అదే ఈ డైలాగ్‌లో చెప్పారేమో.
- నేను హైలెవల్ పర్ఫెక్షనిస్ట్‌గా ఉండాలనుకుంటా. అంటే ఏ చిన్న లోపమూ కనిపించకూడదు. ఈ క్రమంలో చాలా అలసిపోతా. ధ్యానం నా స్ట్రెస్ బస్టర్. ఉదయం, సాయంత్రం మెడిటేషన్ చేస్తా. ఇంకా మనవడున్నాడు నాకు. వాడితో టైం స్పెండ్ చేస్తే కూడా ఒత్తిడి తగ్గిపోతుంది. వాడికి అయిదు సంవత్సరాలు వచ్చేవరకు నా మాట వినేవాడు. ఇప్పుడు నేను ఏం చెప్పినా వినడం లేదు. నాతో ఫైటింగ్ ఎక్కువ. ఎందుకొచ్చిన గొడవని వాడి మాట వినడం అలవాటు చేసుకున్నా.
- నాకు మ్యాథ్స్ ఇష్టం లేదు. హిస్టరీ ఇష్టం. చంద్రబాబు ఎకనామిక్స్ పీజీ చేశారు. ఆ సబ్జెక్టు కూడా ఇష్టం లేదు. చాలా డ్రై సబ్జెక్టు. ఆయన ఎలా మ్యానేజ్ చేశారో.
- నాకు మొదట్లో కుక్స్ లేరు. నేనే వంట చేసేదాన్ని, డ్రైవింగ్ కూడా నేనే. మా ఆయనకు డబ్బులు సేవ్ చేసేదాన్ని. ఇప్పటికి కూడా నేను 20-30 మందికి వంటచేసి వడ్డించగలను. అయితే లోకేశ్ చిన్నప్పుడు నామీద ఒకటే కంప్లయింట్ చేసేవాడు. ఎవరైనా అడిగితే మా అమ్మ ఏమీ చేయలేదు. ఒట్టి రసమన్నం పెడుతుంది అనేవాడు. నేను ఇల్లు ఊడుస్తుంటే బెడ్ కిందనుంచి బర్గర్ల బాక్స్‌లు బయటపడేవి. వాడికి బర్గర్లు, స్నాక్స్ అంటే అప్పట్లో చాలా ఇష్టం. ఫ్రెండ్స్‌తో తెప్పించుకునేవాడేమో.ఇప్పటికీ లోకేశ్‌తో ఆ విషయం గురించి చెప్పి, నవ్విస్తుంటా.
- నాకు బహుమతుల మీద ఆశలేదు. ఆయనను ఎప్పుడూ వాటిని గురించి అడగను. అయితే మా ఫ్రెండ్ హజ్బెండ్ ఒకరు మ్యారేజ్ యానివర్శరీకి ఆవిడకు డైమండ్ రింగ్ కొని ప్రజంట్ చేశారట. నాకు చెప్పింది. నేను కూడా మా యానివర్శరీకి డైమండ్ రింగ్ కొనమని అడిగాను. నువ్వే ఒక డైమండ్, నీకు ఇంకా వేరే డైమండ్ ఎందుకన్నారు. అలా చాకచక్యంగా తప్పించుకున్నారన్న మాట. అంతే, అప్పటి నుంచి నేను ఆయననుంచి ఏ బహుమతులూ కోరలేదు.



కుటుంబ కలహాలతో మహిళ హత్య

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలు మహిళ హత్యకు దారితీశాయి. ఈ ఘటన గురువారం తిరుపతి నగరంలో చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. సింగాలగుంటకు చెందిన ద్రాక్షాయణి నాలుగు ఇళ్లలో పాచి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఆమె కుమారుడు పురుషోత్తం, కోడలు నాగలక్ష్మి భవానీనగర్‌లో కాపురముంటున్నారు. కొన్ని రోజులుగా వీరిద్దరూ తరచూ గొడవ పడుతున్నారు. బుధవారం రాత్రి భర్త గొడవపడుతుండడంతో నాగలక్ష్మి తన సోదరుడు విజయ్‌కు విషయం చెప్పింది. తల్లి మాటలు వినడం వల్లే పురుషోత్తం తన చెల్లితో గొడవపడుతున్నాడని భావించిన విజయ్ శింగాలగుంటకు వెళ్లి ద్రాక్షాయణిని కత్తితో నరికాడు. రక్తపు మడుగులో పడిపోయిన ఆమెను స్థానికులు దగ్గర్లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. అలిపిరి ఎస్ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు.



మృతి చెందిన ద్రాక్షాయణి

అన్న మృతిపై తమ్ముడి అనుమానం

● ఖననం చేసిన మృతదేహానికి ఆరు నెలల తర్వాత పోస్టుమార్టం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): అన్న మృతిపై అనుమానాలు ఉన్నాయని తమ్ముడు ఫిర్యాదు చేశాడు. దీంతో ఖననం చేసిన మృతదేహానికి ఆరు నెలలకు పోస్టుమార్టం నిర్వహించారు. తొట్టంబేడు మండలం దొంగలముదూరు గ్రామానికి చెందిన ఉదయ్‌కమార్(40).. బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాల గ్రామ చెరువు దగ్గర జూన్ 21న మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో క్రైస్తవ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ క్రమంలో ఉదయ్‌కుమార్ మృతిపై తమ్ముడు భానుప్రసాద్‌కు అనుమానం కలిగింది. హత్య చేసి ఉంటారని భావించి గురువారం బీఎన్‌కండ్రిగ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ విశ్వనాథనాయుడు.. దొంగలముదూరు గ్రామానికి చేరుకున్నారు. తహసీల్దార్ మధుసూదన్ రావు సమక్షంలో మృతదేహానికి డాక్టర్లు హరిత, జ్యోతిప్రసూన పోస్టుమార్టం నిర్వహించారు.

ఎల్ఏ ఆర్ అండ్ ఆర్ అథారిటీ న్యాయవాదిగా ఆదినారాయణ

తిరుపతి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న ల్యాండ్ అక్విజేషన్ రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ అథారిటీకి ప్రభుత్వ న్యాయవాదిగా తిరుపతికి చెందిన శాకమూరి ఆదినారాయణ నియమితులయ్యారు. రాయలసీమ జిల్లాల పరిధిలో భూ సేకరణ వివాదాలకు సంబంధించిన కేసులు ఈ అథారిటీ ఎదుట విచారణకు వస్తుంటాయి. ఆ కేసుల్లో ప్రభుత్వ న్యాయవాదిగా ఆదినారాయణ వ్యవహరించనున్నారు. ఆయన సంబంధిత పదవిలో ఏడాది పాటు కొనసాగుతారని ప్రభుత్వం గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

25కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరి అరెస్టు

రేణిగుంట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలో 25 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని.. ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. కొత్త చెక్‌పోస్టు సమీపంలో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని తనిఖీ చేశారు. వారి వద్ద 25 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించారు. గంజాయి విలువ రూ.2.5 లక్షలు ఉంటుంది. నిందితులు తారక రామానగర్‌కు చెందిన సక్కుబాయి, తిరుపతి సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన కట్టమంచి చిరంజీవిగా గుర్తించారు. వీరు విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి రేణిగుంట, తిరుపతి ప్రాంతాల్లో విక్రయిస్తుంటారని గుర్తించారు. కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

మార్చి లోపు పోలేరమ్మ ఆర్చి నిర్మాణం



ఆర్చి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబరు 19 : (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి క్రాస్ రోడ్డులో పోలేరమ్మ ఆర్చి నిర్మాణం మార్చి లోపు పూర్తవుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో నిర్మిస్తున్న ఆర్చి నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఆర్చి నిర్మాణం కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని.. శుక్రవారం నుంచి ఈ మార్గంలోని వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ భాస్కరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు మస్తాన్ నాయుడు, సత్యం, ప్రభాకర్ నాయుడు, వెంకటగిరి, డక్కిలి మండలాల టీడీపీ అధ్యక్షులు పప్పు చంద్రమౌలిరెడ్డి, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, వల్లభనేని మధుసూదనరావు, గల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బాలాయపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగమాంబపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత, మాజీ ఏఎంసీ చైర్మన్ సీసీ నాయుడు తల్లి చెన్నమనేని పార్వతమ్మ కర్మక్రియలు వెంగమాంబపురంలో గురువారం జరిగాయి. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడు, కూను శ్రీహరి, నల్లబోతుల మురళీ, దాసరి ప్రభాకర్ నాయుడు, బద్దెవోలు కళ్యాణ్ రెడ్డి, రాయి సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నీటి సంఘం నాయకులు

బాలాయపల్లి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘం ఎన్నికల్లో మల్లెమాల విష్ణు విజయం సాధించిన సందర్భంగా టీడీపీ నాయకులు గురువారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, పాకపూడి సర్పంచ్ మల్లెమాల గోపీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన మాధవనాయుడు



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కలిసిన టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు మాధవనాయుడు

డక్కిలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని గురువారం ఢిల్లీలో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు, అండమాన్ నికోబార్ దీవుల టీడీపీ ఇన్‌చార్జి వెంపటి మాధవనాయుడు కలిశారు. తిరుపతి విమానాశ్రయానికి అంతర్జాతీయ విమాన సర్వీసులు నడిచేలా కృషిచేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు విజయనగరం ఎంపీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట వాసవి క్లబ్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డును అందుకొంటున్న వాసవి, వనిత క్లబ్ అధ్యక్షురాలు సునీత, జోనల్ చైర్మన్ సాయిరాం

సూళ్లూరుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వాసవి, వనిత క్లబ్‌కు ఈ ఏడాది ఉత్తమ సేవా క్లబ్ అవార్డు దక్కింది. తమిళనాడు మదురైలో రెండురోజుల పాటు జరిగిన వాసవి క్లబ్ అంతర్జాతీయ సమావేశంలో వాసవి క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు సిద్ధ సూర్య ప్రకాశరావు చేతుల మీదుగా ఈ అవార్డును సూళ్లూరుపేట వాసవిక్లబ్, వనిత క్లబ్ నిర్వాహకులు సాయిరాం, సునీత అందుకున్నారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు రవిచంద్రన్, సురేష్ బాబు, డైరెక్టర్ బండారు శబరీష్ గుప్తా, గవర్నర్ సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ



దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రెడ్ సంస్థ ప్రతినిధులు

గూడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో గురువారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో సనిశెట్టి వెంకటసుబ్బమ్మ దాతృత్వంతో దివ్యాంగులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జానా సుధీర్, శ్రీధర్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, సాయి పాల్గొన్నారు.

వణికిస్తున్న విష జ్వరాలు



ప్రభుత్వ ఆస్పత్రిలో జ్వరపీడితులు

సూళ్లూరుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఏ గ్రామం చూసిన విష జ్వరాలతో వణికిపోతున్నాయి. సీజనల్ వ్యాధులతో ఒక్కసారిగా జ్వరాల పంజా విసరడంతో పట్టణం, పల్లెలు తేడాలేకుండా ప్రతి ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరపీడితులు ఉంటున్నారు. వరుస తుపాన్‌లతో పాటు వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో విష జ్వరాలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. జలుబు, దగ్గు, తీవ్ర ఒళ్లు నొప్పులతో కూడిన జ్వరాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. డెంగీ, గన్యా, మలేరియా సైతం వెంటాడుతోంది. రెండు వారాల నుంచి జ్వరాల బారిన పడిన వారు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. జ్వరం ప్రారంభమైన రోజే తీవ్ర తలనొప్పి, వాంతులు కావడం వంటివి చోటుచేసుకొంటున్నాయి. దీంతో ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు వివిధ రకాల పరీక్షల పేరుతో అధిక మొత్తంలో దోచుకుంటున్నారు. ఒక్కసారిగా ప్లేట్‌లెట్స్ పడిపోవడం, వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ వారం రోజుల పైబడి మంచంపడుతున్నారు. జ్వరం తగ్గినా పది రోజుల వరక నీరసంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో దామానెల్లూరు, డేగవారికండ్రిగ, సుగ్గుపల్లి, వెలగలపొన్నూరు, ఉగ్గుముడి, రాగన్నపట్టెడ, దామరాయి, అట్టకానితిప్ప గ్రామాల్లో విష జ్వరాలు అధికంగా ఉన్నాయి. పలు గ్రామాల్లో జ్వరం వచ్చిన వెంటనే కాళ్లు, చేతులు వాపునకు గురికావడం, పట్టుకుపోయి లేవలేకపోవడంతో భయంతో ప్రైవేట్ పెద్దాసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. పేదలు ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పలుచోట్ల నిర్ధారణ పరీక్షలు సక్రమంగా లేకపోవడంత ప్రైవేట్ వైద్యశాలను ఆశ్రయిస్తున్నారు. సూళ్లూరుపేట పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, దోమల నిరాణకు ప్రత్యేక శ్రద్ధ లేకపోవడంతో విష జ్వరాలు బారిన ప్రజలు పడుతున్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు.

సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రిలో వారం రోజుల నుంచి ఒక్కసారిగా ఓపీ 500 నుంచి 600 మంది వరకు వస్తున్నారు. ఇందులో 80 శాతం మంది జ్వర పీడితులు ఉండటం విశేషం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



ప్రీ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు

నాయుడుపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బేరిపేటలోని లూథరన్ చర్చిలో గురువారం సండే స్కూల్ విద్యార్థులచే ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పొరుగువారిని ప్రేమించాలన్నదే ఏసుక్రీస్తు అభిమతమని బిషప్ మైకెల్ బెన్‌హర్ తెలిపారు. పిల్లలు దేవదూతలుగా, గొర్రె కాపరులుగా, శాంతాక్లాజ్ తదితర వేషధారణలలో అలరించారు. కార్యక్రమంలో సండే స్కూల్ సూపరింటెండెంట్ కె. ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు అభినందనలు



ఎన్‌సీసీ క్యాడెట్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎన్‌సీసీ క్యాడెట్ చంద్రమోహన్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు. ఈనెల 21 నుంచి కేరళలోని ఇడుక్కి జిల్లాలోని మరయూర్ అడవుల్లో జరిగే క్యాంపునకు కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ చంద్రమోహన్ ఎంపికయ్యారు. ఎన్‌సీసీ అధికారి మాధవయ్య, డాక్టర్ విక్రమ్‌కుమార్‌లు జ్ఞాపికలు అందించి అభినందించారు.

పడకేసిన పారిశుధ్యం..!

- రొచ్చుగా మారిన మైలాంగంలోని వీధులు
- మురుగు నీటి నిల్వలతో రోగాల బారిన గ్రామస్థులు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



మైలాంగం గ్రామంలో ప్రధాన రహదారిలో రొచ్చు



ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న పేడదిబ్బలు, రోడ్డుపై మురుగు

దొరవారిసత్రం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లుగా మండల రాజకీయాలను శాసిస్తున్న ముఖ్య నాయకుల స్వగ్రామం అది... ఆ గ్రామం నుంచే మండల జడ్పీటీసీ, మండల అధ్యక్షులు పదవులు అనుభవిస్తున్నారు. అయితే ఆ ఊరిలో అడుగు వేయలేని పరిస్థితి. ఆ ఊరి నడుబొడ్డున ప్రధాన రహదారిపై మురుగునీటి నిల్వలతో అవస్థలు పడుతున్నారు. ఇదీ దొరవారిసత్రం మండలంలోని మైలాంగం పరిస్థితి. కురిసిన వర్షాలకు గ్రామంలోని రోడ్లు బురదమయంగా మారాయి. గ్రామం నడ్డిబొడ్డున నేలపట్టు -కలగుంట రహదారిపై కాలు వేయలేని పరిస్థితి. పాదచారులు నడవాలంటే నరకమే. గ్రామం ప్రారంభం నుంచి చివరి వరకు రహదారి అంతా రొచ్చుగా మారింది. రహదారికి ఎగువ భాగంలోని నీటి గుంట నుంచి రహదారిపైకి, ఇళ్ల ముంగిటకు నీరు చేరుతుంది. దీనికి తోడు వర్షపు నీరు నిల్వ చేరడంతో రోడ్డంతా అస్తవ్యస్తంగా మారింది. రహదారికి ఆనుకొని పేడదిబ్బలు ఉండటంతో మరింత దారుణంగా మారుతోంది. నీటి నిల్వలు, దోమల వృద్ధితో గ్రామస్థులు రోగాల బారిన పడుతూ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. మైలాంగంలోని తాగునీటి బోరు చుట్టూ పేడ దిబ్బలు, మురుగు నీటి కుంటలు ఉన్నాయి. దీంతో తాగునీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉండటంతో గ్రామస్థులు ఆందోళనలో పడ్డారు. అయితే పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే మార్గంలోనే రోజూ ఉద్యోగులు, నాయకులు తిరుగుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సమష్టి సహకారంతోనే గ్రామీణాభివృద్ధి



అధికారులతో సర్పంచులు, సిబ్బంది

తడ, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సమష్టి సహకారంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని.. శిక్షణను సద్వినియోగం చేసుకొని ప్రతిజ్ఞకరూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ కొలవి రఘురెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీవో విజయకుమార్, ఈటీసీ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రకాష్, ఏపీవో రాజారెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●దొరవారిసత్రం: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజులుగా జరిగిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. గ్రామాల్లో పేదరిక నిర్మూలన, అందరికీ ఆరోగ్యం, స్వచ్ఛమైన తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, సుస్థిరమైన నగర రూపకల్పనపై సర్పంచులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ అందించారు. ఎంపీడీవో గోవర్ధన్, ఏఈపీఆర్ వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షణాధికారి రఘురామయ్య, సచివాలయ సిబ్బంది, సర్పంచులు పాల్గొన్నారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి



అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో వ్యంగ్యంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ఆయన పదవికి రాజీనామా చేసి బహిరంగ క్షమాపణ చెప్పాలని గురువారం కోటలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, బహుజన ఐక్యవేదిక నాయకులు నిరసన తెలిపారు. అమిత్‌షా దిష్టి బొమ్మను ఆర్టీసీ సెంటర్‌లో తగులబెట్టి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్టీసీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మీజూరు మాధవ్, పసల చిరంజీవి, అశోక్ కాంబ్లే, ఏడుకొండలు, బహుజన ఐక్యవేదిక నాయకులు దాసరి సుందరం, గంగయ్య, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

●సూళ్లూరుపేట: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పై అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని వామపక్షాలు డిమాండు చేశారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు అల్లెయ్య, రియాజ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

●వెంకటగిరి టౌన్ : పార్లమెంటులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, సీఐటీయూ పెంచలయ్య, సుబ్బరామయ్య, నాగమణి, గీత, ధనలక్ష్మీ, భాస్కర్, కేవీపీఎస్ రమణయ్య, రాజయ్య, గిరిజన సంఘం నాయకులు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

●గూడూరు అర్బన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచి పద్ధతి కాదని కేవీపీఎస్ నాయకులు అన్నారు. గురువారం స్థానిక టవర్ క్లాక్ కేంద్రం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రసాద్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రమణయ్య, సురేష్, శివకుమార్, శ్రీనివాసులు, బీవీ రమణయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

పుష్కలంగా సాగునీరు

- ప్రమాదకరంగా 12 చెరువులు



నిండిన చంద్రశేఖరపురం చెరువు

కోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది కురిసిన వర్షాలకు మండలంలోని 35 నీటి పారుదల శాఖ చెరువులకు వర్షపునీరు నిల్వచేరింది. గత ఏడాదిని పోల్చుకుంటే ఈ ఏడాది చివరిలో అల్పపీడనాలతో ఆశించినంత వర్షాలు కురుస్తుండటంతో అన్ని చెరువులు పూర్తిగా నిండాయి. ఈ ఏడాది వరిపంట సాగుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రధానమైన 7 వేల ఎకరాల ఆయకట్టు కలిగిన పెన్నక్క చెరువులోనూ నీరు చేరుతుండటంతో స్థానిక ఆయకట్టు రైతులు ఆనందాలకు అవధుల్లేవు. మండల పరిధిలోని కొండుగుంట, రాఘవాపురం, మద్దాలి, కేశవరం, చిట్టేడులోని 3 చెరువులు, ఊనుగుంటపాళెం, చంద్రశేఖరపురం, ఉత్తమనెల్లూరు, కోట చెరువులకు వర్షపునీరు నిల్వ చేరింది. అయితే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గతంలో మరమ్మతులు చేయని కారణంగా తెగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. వంజివాక, పుచ్చలపల్లి, చిట్టేడు తాటిచెరువు, ఉత్తమనెల్లూరు చెరువులకు గతంలో మరమ్మతులు జరగకపోవడంతో వర్షాలు తీవ్రతరం అయితే చెరువులు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఎక్కువైతే 12 చెరువులు ప్రమాదపు అంచుల్లో ఉన్నాయి. అధికారులు స్పందించి ప్రమాదకర చెరువులను పరిశీలించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు, ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధే ముఖ్యమంత్రి లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



మాట్లాడుతున్న గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి

పెళ్లకూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం మండలంలోని చెంబేడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అపారమైన అనుభవంతో ముఖ్యమంత్రి సుమారు రూ. 30 వేల కోట్లతో మరో మూడేళ్లలో అత్యుతమైన రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులను ప్రతిజ్ఞకరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు ద్వారకనాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమీలారాణి, ఏవో ప్రవీణ, టీడీపీ మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగ్రేంద ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●దొరవారిసత్రం: ఆనేగొట్టం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూ సమస్యలపై తహసీల్దారు శైలాకుమారికి వినతులు అందించారు. సమావేశంలో నాయకులు వీరస్వామి నాయుడు, వీఆర్వో సుబ్రహ్మణ్యం, సర్వేయర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

●ఓజిలి: వీర్లగునుపాడులో గురువారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు భూ వివాదాలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

●బాలాయపల్లి: మండలంలోని కాలగంద, కోనంగుంట గ్రామాల్లో గురువారం తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై 20 అర్జీలు స్వీకరించారు. ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు పాల్గొన్నారు.

డక్కిలి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామంలో తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. పలు సమస్యలపై రైతులు, ప్రజలు అర్జీలు అందించారు. సర్వేయర్ రాజగోపాల్, వీఆర్వో అమని, టీడీపీ మండలాధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, నాయకులు అయ్యపరెడ్డి పాల్గొన్నారు.

●చిల్లకూరు: మండలంలోని అంకులపాటూరు గ్రామంలో గురువారం తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్ మల్లికార్జున్‌రావు, ఆర్ఐ పూర్ణా, వీఆర్వో శ్రీనివాసులు, టీడీపీ నాయకులు సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, అన్నం మునిశేఖర్‌గౌడ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

●కోట: అల్లంపాడులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు జయజయరావు రైతుల నుంచి వినతి పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధులత, సర్వేయర్ గోపిరెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●వాకాడు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించి పరిష్కరిస్తోందని గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి అన్నారు. పామాంజి గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావు, వీఆర్వో శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, పనబాక కోటేశ్వరరావు, బత్తిన ప్రమీల, కుంచం దయాకర్, పేట శ్రీహరి, శివకోటి, బాలచంద్రయ్యశెట్టి పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

వెంకటగిరి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీ శ్రీనివాసన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బంగారుపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఆ సంస్థ క్లస్టర్ ఇన్‌చార్జి జయసింగ్ గురువారం తెలిపారు. తిరుపతి అరవింద ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఆర్టీసీ డిపోలో అదెకుఉ బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ డీఎం రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అహోబిలం నరసింహ క్షేత్రం, అన్నవరం సత్యనారాయణ స్వామి, కదిరి నరసింహ క్షేత్రం, ఉడిపి, శ్రీరంగం మొదలగు క్షేత్రాలకు బస్సులు అద్దెకు పంపనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 99592 25647, 73828 86789, 73828 87743, 93815 39535లను సంప్రదించాలని కోరారు.

వెందోడులో 'పొలం పిలుస్తోంది'

గూడూరు అర్బన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్ర, వెందోడు గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రమేష్ మాట్లాడుతూ రైతులకు పంటల సాగుపై పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో చక్రీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ చంద్రయ్య (45) మృతి చెందినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. మండలంలోని చిలమత్తూరు గ్రామానికి చెందిన చంద్రయ్య ఆటో నడుపుకుంటూ కాపులూరుకు వెళ్లి తిరిగి నాయుడుపేటకు వస్తుండగా ఈనెల 17న అయ్యప్పరెడ్డిపాళెంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. గాయపడిన చంద్రయ్య నెల్లూరులో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

దేశాభివృద్ధే యువతకు లక్ష్యం కావాలి



గూడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధే యువతకు లక్ష్యం కావాలని ఇన్సాఫ్ కమిటీ ప్రతినిధి జమాలుల్లా అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ, ఇన్సాఫ్ కమిటీల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లాఖాన్ ల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, కాలేషా, శశికుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత శ్లోకాలపై పోటీలు



భగవద్గీత శ్లోకాలను వివరిస్తున్న విద్యార్థి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భాష్యం పాఠశాలలో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు సుంకర రవి మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. 50 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య , అవ్వారు శ్రీనివాసులు, చల్లా గంగేశ్వరరావు, చేబ్రోలు రవీంద్ర పాల్గొన్నారు.

సీపీఐ పటిష్టతకు కలిసికట్టుగా కృషి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గూడూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ పటిష్టతకు అందరూ కలిసికట్టుగాపనిచేద్దామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ శతాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ పార్టీ పనిచేస్తుందన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శశికుమార్, కాలేషా, రమణయ్య, చంద్రయ్య, నారాయణ, శ్రీనివాసమూర్తి, జమాలుల్లా, మస్తానయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



శైలేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శేషవర్ధన్ తదితరులు

కోట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడు గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న శైలేష్ స్కూల్ గేమ్ ఫెడరేషన్‌లో కబడ్డీ విభాగంలో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ శేషవర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ సత్యనారాయణ ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లతో అభినందించారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు హర్యానాలోని బివాదీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా పోటీలు జరిగాయి. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున నెల్లూరు జిల్లా నుంచి ఇక్కడ గిరిజన గురుకులం విద్యార్థి శైలేష్ పాల్గొని ప్రతిభ చూపాడు.